Follow: @ANNTELUGU
28-02-2026
ANN తెలుగు
# మహా పత్రిక
శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 61 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

## టీవీకే చీఫ్ విజయ్‌కు షాక్

తమిళ రాజకీయాలలో మరో సంచలనం

కోర్టు మెట్లెక్కిన టీవీకే చీఫ్, నటుడు విజయ్ భార్య

విడాకులు కావాలంటూ పిటిషన్ దాఖలు

అక్రమ సంబంధమే కారణమని విజయ్ భార్య సంగీత ఆరోపణ

తన వద్ద ఆధారాలున్నాయంటూ పిటిషన్ లో వెల్లడి



**మహా :** తమిళ సినీనటుడు, తమిళగ వెట్రి కళగం పార్టీ అధినేత విజయ్ వ్యక్తిగత జీవితంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయన భార్య సంగీత విజయ్ చెంగల్‌పట్టు కుటుంబ న్యాయస్థానంలో విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యవహారం తమిళనాడు రాజకీయ, సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. విజయ్ భార్య సంగీత విడాకులు కోరుతూ చెంగల్‌పట్టులోని ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వివాహ జీవితం సజావుగా కొనసాగడం లేదని, వ్యక్తిగత కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. న్యాయస్థానం పిటిషన్‌ను స్వీకరించిన న్యాయస్థానం ఏప్రిల్ 20వ తేదీన కోర్టుకు హాజరుకావాలని విజయ్‌కు నోటీసులు జారీ చేసింది.

మిగతా 2లో

### టాప్ న్యూస్

## జగన్‌పై రెడ్ బుక్

- పేరు ఉందోలేదో త్వరలో తెలుస్తుంది
- ముంబైలో నారా లోకేశ్ సంచలనం



02

## దానం ట్విస్ట్

- విచారణకు డుమ్మా
- మార్చి 2కు వాయిదా



02

## కవితకు న్యాయం జరిగింది

- లిక్కర్ స్కామ్ రాజకీయ కల్పితం
- ఈ కేసు వల్లే బీఆర్ఎస్ కు రాజకీయ నష్టం జరిగింది
- తీర్పుపై స్పందించిన కేటీఆర్



02



# కవితకు క్లీన్ చిట్

### ఢిల్లీ లిక్కర్ కేసు కొట్టేసిన ట్రయల్ కోర్టు.. ఐదు నెలలు జైలులో గడిపిన కవిత

### కేజ్రీవాల్, సిసోడియా సహా 23 మందికి ఊరట.. తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టుకు సీబీఐ

సత్యమే గెలిచిందన్న కవిత.. బోరున ఏడ్చేసిన కేజ్రీవాల్.. కిందికోర్టు తీర్పుతో అంతా అయిపోలేదన్న ఢిల్లీ సీఎం రేఖా గుప్తా

**ఢిల్లీ, మహా:**

ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. లిక్కర్ కేసులో రౌస్ అవెన్యూ కోర్టు కీలక తీర్పు వెల్లడించింది. లిక్కర్ పాలసీ అవినీతి కేసులో సరైన ఆధారాలు లేవని వ్యాఖ్యలు చేసింది. సీబీఐ సరైన మెటీరియల్ లేకుండా కేసులో ఇరికించిందని కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. భారీ ఛార్జ్‌షీట్‌లో అనేక లోపాలు ఉన్నాయని, వాటికి సాక్షులు లేదా స్టేట్‌మెంట్ల మద్దతు లేదని స్పష్టం చేసింది. సిసోడియాపై ప్రాథమికంగా కేసు కూడా నిలబడలేదని కోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. అరవింద్ కేజ్రీవాల్, మనీష్‌సిసోడియా లను కోర్టు డిశ్చార్జ్ చేసింది. కేజ్రీవాల్‌ను సరైన ఆధారాలు లేకుండా ఇరికించారని జడ్జి వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు భారీ ఊరట లభించింది. కవితకు క్లీన్ చిట్ ఇచ్చింది రౌస్ అవెన్యూ కోర్టు కవితపై సీబీఐ నమోదు చేసిన అభియోగాలన్నిటిని కొట్టివేసింది. కవితతో పాటు ఈ కేసులో ఉన్న 23 మంది నిందితులు తప్పు చేశారన్న సాక్ష్యా దారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. కవితపై సీబీఐ మోపిన ఆరోపణలన్నింటినీ కోర్టు తోసిపుచ్చింది. ఈ కేసులో ఆమెకు పూర్తిస్థాయిలో క్లీన్‌చిట్ ఇస్తున్నట్లు ప్రకటించింది.

మిగతా 2లో

## కడిగిన ముత్యంలా బయటకు వచ్చా...

- ఐదునెలలు జైలులో తీవ్ర వేదనకు లోనయ్యా
- బీఆర్ఎస్ ఓటమిని నా మెడలో వేయొద్దు
- కేటీఆర్ నిజాలు మాట్లాడాలి
- కోర్టు క్లీన్ చిట్ తర్వాత కవిత రియాక్షన్



02



## అఫ్గాన్- పాక్ మధ్య యుద్ధం

### పరస్పర దాడుల్లో వందకు పైగా మృతి

**మహా:** పాకిస్థాన్‌అఫ్ఘానిస్థాన్‌లు ఘోరంగా తలపడుతున్నాయి. ఇరు దేశాలు పరస్పరం దాడులు చేసుకోవడంతో ఈసారి మృతుల సంఖ్య భారీగా ఉన్నట్లు తెలుస్తోంది. 55 మంది పాకిస్థానీ సైనికులను మట్టుబెట్టినట్లు తాలిబన్లు ప్రకటించగా, 133 మంది తాలిబన్లను హతమార్చినట్లు పాక్ సైన్యం వెల్లడించింది. తమవైపు కేవలం ఇద్దరు మాత్రమే మృతిచెందారని ముగ్గురు గాయపడ్డారని పాక్ తెలిపింది. ఈ క్రమంలోనే పాకిస్థాన్ కీలక ప్రకటన చేసింది.

మిగతా 2లో




బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో

## మంత్రి కొండా సురేఖ ఆకస్మిక తనిఖీ

- నలుగురు ఉద్యోగులు తొలగింపు
- అర్చకుడికి చార్జ్ షీట్
- ఈవో, సూపరింటెండెంట్ సస్పెన్షన్‌కు ఆదేశం

**హైదరాబాద్, మహా:** బల్కంపేట ఎల్లమ్మ దేవాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన అటవీ,పర్యావరణ, మరియు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించిన పలువురు అధికారులపై వేటు వేశారు..ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడం వంటి తీవ్రమైన అంశాలను మంత్రి గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నలుగురు సిబ్బందిని సేవల నుండి తొలగించాలని మంత్రి ఆదేశించారు.

మిగతా 2లో




## కింది కోర్టు తీర్పుతో అయిపోలేదు

- అసలు పిక్చర్ ముందుంది
- ఢిల్లీ సీఎం రేఖా గుప్తా సంచలన వ్యాఖ్యలు

**ఢిల్లీ, మహా:** మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన తీర్పు కేవలం దిగువ కోర్టు ఇచ్చిన తీర్పు మాత్రమేనని, పై కోర్టుల్లో న్యాయం జరుగుతుందని ఢిల్లీ సీఎం రేఖా గుప్తా ఆశాభావం వ్యక్తం చేశారు.

మిగతా 2లో

# ఎంసెట్ రద్దు

### రేవంత్ సర్కార్‌కు సిఫార్సు చేసిన విద్యా కమిషన్

ఫీజుల నియంత్రణకు ప్రత్యేక కమిషన్

ప్రభుత్వ స్కూళ్లలోనూ ఎల్ కేజీ, యూకేజీ తరగతుల నిర్వహణ




**హైదరాబాద్, మహా :** ఇంజనీరింగ్, అగ్రికల్చర్ చదవాలనుకునే విద్యార్థులకు తెలంగాణ విద్యా కమిషన్ ఒక సంచలన తీపి కబురు అందించింది. ఇకపై ఎంసెట్ పరీక్షను పూర్తిగా రద్దు చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. దీనికి బదులుగా కేవలం ఇంటర్మీడియట్ అంటే 12వ తరగతిలో వచ్చే మార్కుల ఆధారంగానే విద్యార్థులకు ఇంజనీరింగ్, అగ్రికల్చర్ సీట్లు కేటాయించాలని ప్రతిపాదించింది. ప్రస్తుతం ప్రవేశ పరీక్షల వల్ల విద్యార్థులపై తీవ్రమైన మానసిక ఒత్తిడి పెరుగుతోందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి స్పష్టం చేశారు. ఈ మేరకు కమిషన్ రూపొందించిన నివేదికను సీఎం రేవంత్ రెడ్డికి శుక్రవారం అందజేశారు.

### మార్పులు ఎలా ఉండబోతున్నాయంటే..

ప్రస్తుతం ఉన్న విద్యా వ్యవస్థలో భారీ మార్పులు రాబోతున్నాయి. ఇకపై ఇంటర్మీడియట్‌ను విడిగా కాకుండా, స్కూల్ ఎడ్యుకేషన్‌లోనే విలీనం చేసి 11, 12వ తరగతులుగా పరిగణించనున్నారు. అంతేకాకుండా, పాస్ మార్కులను కూడా పెంచాలని కమిషన్ కోరింది.

మిగతా 2లో

## బబ్బర్ షేర్స్‌ను ప్రజలు చెప్పులతో కొట్టారు

యూత్ కాంగ్రెస్‌పై మోదీ ఫైర్


వివరాలు 2లో

## మావోయిస్టుల లొంగుబాట్లపై అసెంబ్లీలో ప్రకటన

- ఆరుగురు కీలక నేతలతో సీఎం రేవంత్ చర్చలు
- ప్రజాస్వామ్యం ద్వారా ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని గుర్తించడం అభినందనీయం
- పొలిటికల్ అజెండా, పునరావాస ప్యాకేజీలపై చర్చలు

02





ANN తెలుగు

# మహా పత్రిక

శనివారం, హైదరాబాద్ | 28-02-2026 | జనరల్ వార్తలు | GENERAL NEWS | WWW.MAHAADAILY.COM



# కవితకు క్లీన్ చిట్

- ఢిల్లీ లిక్కర్ కేసు కొట్టేసిన ట్రయల్ కోర్టు
- ఐదునెలలు జైలులో గడిపిన కవిత
- కేజ్రీవాల్, సిసోడియా సహా 23 మందికి ఊరట
- తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టుకు సీబీఐ
- సత్యమే గెలిచిందన్న కవిత.. బోరున ఏడ్చేసిన కేజ్రీవాల్
- కిందికోర్టు తీర్పుతో అంతా అయిపోలేదన్న ఢిల్లీ సీఎం రేఖా గుప్తా


(మొదటిపేజీ తరువాయి)

కవితతో పాటు ఈ కేసులో నిందితులుగా ఉన్న ఆమె ఆడిటర్ బుచ్చిబాబు, సీఎం కేజ్రీవాల్, మంత్రి మనీష్ సిసోడియాతో సహా మరో 20 మంది తప్పు చేశారని చెప్పడానికి ఎటువంటి పక్కా సాక్ష్యాధారాలు లేవని, చార్జ్‌షీట్‌లో అనే లోపాలు ఉన్నాయని కోర్టు స్పష్టం చేసింది. సీబీఐ ప్రత్యేక కోర్టు జడ్జి జితేందర్ సింగ్ ఈ మేరకు కీలక ఉత్తర్వులు జారీ చేశారు. తగిన ఆధారాలు చూపడంలో దర్యాప్తు సంస్థ సీబీఐ విఫలమైందని కోర్టు అభిప్రాయపడింది. రెండేళ్లకు పైగా సాగిన ఈ కేసులో ఇప్పటికే కవిత జైలుకు వెళ్లి బెయిల్‌పై విడుదలయ్యారు. తాజాగా, కోర్టు ఆమెపై ఉన్న కేసును కొట్టివేయడంతో కవితకు, బీఆర్ఎస్ శ్రేణులకు పెద్ద ఎత్తున ఊరట లభించినట్లయింది.

202122 సంవత్సరానికి గాను ఢిల్లీ ప్రభుత్వం కొత్త మద్యం విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో కొన్ని అక్రమాలు జరిగాయని ఆరోపణలు రావడంతో ఈ వివాదం మొదలైంది. దీంతో 2022 జూలైలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా మొత్తం వ్యవహారంపై సీబీఐ విచారణకు ఆదేశించారు. మరోవైపు లైసెన్స్ ఫీజు మాఫీ చేయడం వల్ల ప్రభుత్వ ఖజానాకు వందల కోట్ల నష్టం వాటిల్లిందని అప్పటి ఢిల్లీ చీఫ్ సెక్రటరీ నివేదిక కూడా ఇచ్చారు. మద్యం వ్యాపారులకు మేలు చేసేలా పాలసీని రూపొందించారని, దానికి ప్రతిఫలంగా ఆప్ నాయకులకు రూ.కోట్ల ముడుపులు అందాయని సీబీఐ అధికారులు అభియోగాలు మోపారు. ఈ స్కామ్‌లో 'సౌత్ గ్రూప్' పేరుతో కొందరు వ్యాపారులు, కల్వకుంట్ల కవిత లాంటి రాజకీయ నాయకులు కీలక పాత్ర పోషించారని, సుమారు రూ.100 కోట్ల వరకు ముడుపులు చెల్లించారని సీబీఐ తప దర్యాప్తులో తేల్చి నిందితులపై ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ క్రమంలోనే 2023 ఫిబ్రవరి ఫిబ్రవరి 26న ఆప్ మంత్రి మనీష్ సిసోడియా, 2024 మార్చి 15న కల్వకుంట్ల కవిత, మార్చి 21న సీఎం హోదాలో ఉన్న సీఎం అరవింత్ కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్ట్ చేసింది. అనంతరం వారంతా ఒక్కొక్కరుగా బెయిల్‌పై విడుదలైన విషయం తెలిసిందే. ఈ మేరకు ఇవాళ కేసుపై తుది విచారణ చేపట్టి ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు కల్వకుంట్ల కవితతో సహా మొత్తం 23 మందిని నిర్దోషులుగా ప్రకటిస్తూ క్లీన్‌చిట్ ఇచ్చింది. కాగా తీర్పు వెలువడగానే సత్యమేవజయతే అంటే కవిత ట్వీట్ చేయగా, ఆప్ అధినేత కేజ్రీవాల్ భావోద్వేగంతో బోరున ఏడ్చేశారు. తాను సామాన్యుడినని, ఏ తప్పుచేయలేదన్నారు.

## కడిగిన ముత్యంలా బయటకు వచ్చా...

- ఐదునెలలు జైలులో తీవ్ర వేదనకు లోనయ్యా
- బీఆర్ఎస్ ఓటమిని నా మెడలో వేయొద్దు
- కేటీఆర్ నిజాలు మాట్లాడాలి
- కోర్టు క్లీన్ చిట్ తర్వాత కవిత రియాక్షన్



హైదరాబాద్, మహా : ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసు తప్పుడు కేసు అని ఎప్పటి నుంచో చెబుతున్నానని.. కడిగిన ముత్యంలా బయటకు వస్తానని అన్నానని.. కోర్టు తీర్పుతో అదే జరిగిందని కవిత అన్నారు. కానీ.. ఐదున్నర నెలలు కుటుంబానికి దూరం ఉన్నానని.. అవమానాలు, బాధ, వ్యక్తిత్వ హననం ఎదుర్కొన్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని కోట్లు ఇచ్చినా ఈ అవమానం తీరదని.. తమ కుటుంబానికి సైతం అన్యాయం జరిగిందని అన్నారు. కష్టసమయంలో అండగా నిలిచిన తల్లిదండ్రులకు, అత్తామామలకు, భర్తతోపాటు ఆయన కుటుంబానికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే.. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ తప్పుడు కేసును కొట్టివేస్తూ కోర్టు ఇచ్చిన తీర్పుకు భారత న్యాయ వ్యవస్థకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కేసులో ఆర్గ్యుమెంట్స్ ఫాల్స్ అని కోర్టు స్పష్టం చేసిందని..కేసులో ఉన్న వారందరికీ క్లీన్ చిట్ ఇవ్వడం సంతోషకరమన్నారు. కేసు ప్రతీ హియరింగ్‌కు ఇక్కడున్న కార్యకర్తలే వచ్చి తనకు నైతిక స్థైర్యం ఇచ్చారని తెలిపారు. తాను ప్రజాసేవ చేసేందుకు ఈ కేసులు ఏ మాత్రం అడ్డంకావని అన్నారు.

**కేటీఆర్ ట్వీట్ పై ఫైర్**

కోర్టు తీర్పుపై కేటీఆర్ చేసిన ట్వీట్‌లో లిక్కర్ కేసు కారణంగానే పార్టీ ఓడిపోయినట్లు రాశారని.. బీఆర్ఎస్ ఓటమిని తన మెడలో వేయొద్దని.. అలా చేయాలని చూస్తే ప్రజలు హర్షించరని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసుపై మీడియాతో మాట్లాడారు. ఉద్యోగాలు, ఇళ్లు ఇవ్వకపోవటం.. దోపిడీదారులకు టికెట్లు ఇవ్వడం.. అహంకారం కారణంగానే బీఆర్ఎస్ ఓడిపోయిందన్నారు. ఒకవైపు కంగ్రాట్స్ చెబుతూనే.. మరోవైపు పార్టీ ఓటమికి ఈ కేసే కారణమనేలా ట్వీట్ చేశారన్నారు. ఈ కేసు వల్లే ఓడిపోయినట్లు అడ్డమైన రాతలను సోషల్ మీడియాలో రాస్తున్నారని ఫైర్ అయ్యారు. ఈ కేసు పెట్టింది బీఆర్ఎస్‌పై కక్ష సాధింపు కోసం కాదా అని ప్రశ్నించారు. తాను జైలుకు వెళ్లాక కేసీఆర్, కేటీఆర్ సహా పెద్ద నాయకులెవరూ ఎందుకు ప్రెస్ మీట్ పెట్టలేదని ప్రశ్నించారు.

## ప్రజా తీర్పును శిరసావహించా...

అత్యంత పవిత్రంగా తొమ్మిది రోజులు అన్నం తినకుండా బతుకమ్మ ఎత్తుకొని జాతి సంస్కృతిని తెలిపిన బిడ్డనని.. అలాంటిది బతుకమ్మ ప్లేస్‌లో లిక్కర్ బాటిల్ ఎత్తుకున్నట్లు బీజేపీ సోషల్ మీడియా తనను అవమానిస్తుంటే బీఆర్ఎస్ సోషల్ మీడియా ఎక్కడికి పోయిందని నిలదీశారు. ఆనాడే అలాంటి తప్పుడు ప్రచారాలను ఎదుర్కొంటే బీఆర్ఎస్‌కు ఈ గతి పట్టేదా అని ప్రశ్నించారు. నిజామాబాద్‌లో తాను ఓడిపోయినప్పుడు కూడా ప్రజా తీర్పును శిరసావహించానని.. కారణాలు వెతకలేదని అన్నారు. కేజ్రీవాల్ అరెస్ట్ అయిన తర్వాత ఢిల్లీలో ఎన్నికలు జరిగాయని.. తెలంగాణలో మాత్రం అసెంబ్లీ ఎన్నికల తర్వాతే తాను అరెస్ట్ అయ్యానని వెల్లడించారు. ఇప్పటికైనా కేటీఆర్ వాస్తవాలు అంగీకరించి నిజాలు మాట్లాడాలని సూచించారు. ఎక్సైజ్ పాలసీ కేసు సమయంలోనూ పార్టీ, పార్టీ సోషల్ మీడియా తనకు సపోర్ట్‌గా లేదన్నారు. బీజేపీ చేసిన తప్పుడు ప్రచారాన్ని ఎదుర్కోవడంలో విఫలమైందని ఆరోపించారు. ఆ రెండు పార్టీలూ ఒక్కటేనని ఆరోపించారు. పార్టీ పెట్టనున్న రెండు నెలల ముందు ఈ తీర్పు రావటమంటే ప్రకృతి ఆశీర్వాదం ఇచ్చినట్లేనని వెల్లడించారు. తనకు బీఆర్ఎస్ లాగా సోషల్ ఆర్మీ లేదని.. ఇక్కడున్న పిడికెడు మందితోనే తాను ప్రజల పక్షాన పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. ఒక ఆడబిడ్డ కష్టంలో ఉన్నప్పుడు అడ్డమైన టైటిల్స్ పెట్టిన అడ్డగాడిదలకు తగిన సమయంలో బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు.

# మావోయిస్టుల లొంగుబాట్లపై అసెంబ్లీలో ప్రకటన

- ఆరుగురు కీలక నేతలతో సీఎం రేవంత్ చర్చలు
- ప్రజాస్వామ్యం ద్వారా ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని గుర్తించడం అభినందనీయం
- పొలిటికల్ అజెండా, పునరావాస ప్యాకేజీలపై చర్చలు

హైదరాబాద్, మహా : మావోయిస్టు పార్టీ మాజీ అగ్రనేతలతో సచివాలయం వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చలు జరిపారు. జనజీవన స్రవంతిలోకి వచ్చిన తర్వాత చట్ట పరిధిలో వారు ఏదైనా చేసుకోవచ్చు. చట్టాలు ఉల్లంఘిస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుందని అన్నారు. మావోయిస్టుల లొంగుబాట్లపై అసెంబ్లీలో ప్రకటన చేస్తానని వెల్లడించారు. పొలిటికల్ ఎజెండాపైన దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, నూనె నరసింహారెడ్డి, సుజాతక్క, దామోదర్, చంద్రన్నలు సీఎం రేవంత్‌తో చర్చలు జరిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ ఏడీజీ విజయ్ కుమార్, స్పెషల్ బ్రాంచీ ఐజీ సుమతి పాల్గొన్నారు. గతంలో సచివాలయంలోకి మాజీ మావోయిస్టులకు ఎంట్రీ ఉండేది కాదు. కానీ ఇపుడు మాజీ మావోయిస్టు నేతలకు సచివాలయంలోకి సాదర స్వాగతం పలకడం ప్రాధాన్యత సంతరించుకుంది.

**ప్రజాస్వామ్యం ద్వారా ఆంకాంక్షలు నెరవేరుతాయి**

సీఎం రేవంత్‌రెడ్డి లొంగిపోయిన మావోయిస్టుల నేతలను ప్రత్యేకంగా అభినందించారు. ఇన్నేళ్లుగా అడవుల్లో గడిపి ప్రజాస్వామ్య మార్గాన్ని ఎంచుకున్నందుకు అభినందనలు తెలిపారు. హింస సమాజంలోని ఏ సమస్యకూ శాశ్వత పరిష్కారం కాదన్నారు. ప్రజల ఆకాంక్షలు ప్రజాస్వామ్యం ద్వారానే నెరవేరుతాయన్న సీఎం మాజీ మావోయిస్టులకు ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని తెలిపారు. సంపూర్ణ భద్రత, గౌరవంగా జీవించేలా సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు.

**పొరుగు రాష్ట్రాల తరహాలో ప్యాకేజీ ఇవ్వండి**

రెండేళ్లలో 591 మంది మావోయిస్టులు లొంగిపోయారని ఈ సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి వివరించారు. పోలీసుల సమన్వయం, ప్రభుత్వ పునరావాస విధానాలతో జనజీవన స్రవంతిలో కలుస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మాజీ మావోయిస్టు నేతలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సాయుధ పోరాటాన్ని వీడి ప్రధాన స్రవంతిలోకి వచ్చేందుకు అవకాశమిచ్చినందుకు ముఖ్యమంత్రికి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. పొరుగు రాష్ట్రాల తరహాలో మెరుగైన పునరావాస ప్యాకేజీలు కల్పించాలని మాజీ మావోయిస్టులు కోరారు. దీనికి సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ ఏడీజీ విజయ్ కుమార్, స్పెషల్ బ్రాంచీ ఐజీ సుమతి పాల్గొన్నారు.

## జగన్‌పై రెడ్ బుక్

**పేరు ఉందోలేదో త్వరలో తెలుస్తుంది**

**ముంబైలో నారా లోకేశ్ సంచలనం**

మహా: ముంబయిలో ఏపీ మంత్రి నారా లోకేష్ సంచలన ప్రకటన చేశారు. తెలుగు రాజకీయాల్లో కాక పుట్టించారు. ఏబీపీ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో జరిగిన 'ఐడియాస్ ఆఫ్ ఇండియా 2026' సదస్సులో ఏపీ ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ పలు కీలక అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా, గత ప్రభుత్వ హయాంలో అక్రమాలకు పాల్పడిన వారి పేర్లతో తాను నిర్వహిస్తున్న 'రెడ్ బుక్'లో మాజీ ముఖ్యమంత్రి జగన్ పేరు ఉందో లేదో త్వరలోనే తెలుస్తుందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో తమ పార్టీ కార్యకర్తలను, నాయకులను, సాధారణ ప్రజలను అక్రమ కేసులతో తీవ్రంగా వేధించారని లోకేశ్ ఆరోపించారు. చట్టాన్ని ఉల్లంఘించిన అధికారులు, వారిని ప్రోత్సహించిన రాజకీయ నాయకులు, చిత్రహింసలకు గురిచేసిన వారి పేర్లను రెడ్ బుక్‌లో నమోదు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరని, తప్పు చేసిన ప్రతి ఒక్కరూ శిక్ష అనుభవించాల్సిందేనని హెచ్చరించారు. అయితే, ఈ జాబితాలో జగన్ పేరు ఉందా లేదా అనే విషయంపై ఉత్కంఠ రేపుతూ, ఆ విషయం త్వరలోనే తేలుతుందని వ్యాఖ్యానించారు.

## దానం ట్విస్ట్

హైదరాబాద్, మహా : ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విచారణలో భాగంగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై దాఖలైన పిటిషన్లను అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శుక్రవారం విచారించారు. దానం పార్టీ మారారని ఆయనపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డిలు దాఖలు చేసిన పిటిషన్లపైన స్పీకర్ ఛాంబర్‌లో విచారణ జరిగింది. ఈ విచారణకు దానం నాగేందర్ గైర్హాజరు అయ్యారు. దానం తరుపు న్యాయవాదులను పిటిషనర్ల తరుపు అడ్వకేట్లు క్రాస్ ఎగ్జామిన్ చేశారు. ఆధారాలకు సంబంధించిన అఫిడవిట్ లను దానం న్యాయవాదులు దాఖలు చేయలేదు. తదుపరి విచారణను మార్చి 2వ తేదీకి స్పీకర్ వాయిదా వేశారు. దానం హాజరుకాకపోవడంపై చర్చ జరుగుతోంది.

## కవితకు న్యాయం జరిగింది

హైదరాబాద్, మహా: ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో వెలువడిన తీర్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి, బీఆర్ఎస్ నాయకులను బద్నాం చేయడానికి ఈ అక్రమ కేసును సృష్టించారని ఆయన మండిపడ్డారు. ఈ లిక్కర్ స్కామ్ అనేది పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనదని కేటీఆర్ విమర్శించారు. కేవలం రాజకీయంగా దెబ్బతీయాలనే లక్ష్యంతోనే ఈ కథనాన్ని అల్లారని, దీనివల్ల అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ రాజకీయంగా నష్టపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమ నాయకులపై మోపిన ప్రతి కేసు అబద్ధమని, అది కేవలం కల్పితమని ఆయన స్పష్టం చేశారు. కవితకు కోర్టులో న్యాయం లభించడాన్ని కేటీఆర్ స్వాగతించారు. తమ పార్టీ నాయకులపై మోపిన అక్రమ కేసులు ఒక్కొక్కటిగా వీడిపోతాయని, చివరకు నిజం నిలకడగా తెలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం దర్యాప్తు సంస్థలను వాడుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని హితవు పలికారు. కాంగ్రెస్, బీజేపీలు కలిసి తమపై తప్పుడు ఆరోపణలు చేస్తూ విషం చిమ్మాయని కేటీఆర్ ధ్వజమెత్తారు. కొన్ని మీడియా సంస్థలు కూడా ఈ ప్రక్రియలో భాగస్వాములై "మీడియా ట్రయల్స్" నిర్వహించి ప్రజలను తప్పుదోవ పట్టించాయని ఆయన విమర్శించారు. సాక్ష్యాధారాల కంటే ఆరోపణలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ, రాజ్యాంగబద్ధమైన ప్రక్రియలను పక్కన పెట్టడం దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా అంతిమంగా న్యాయమే గెలుస్తుందని కేటీఆర్ తన ట్వీట్‌లో స్పష్టం చేశారు.

# టీవీకే చీఫ్ విజయ్‌కు షాక్

(మొదటిపేజీ తరువాయి)

లండన్‌కు చెందిన తమిళ కుటుంబానికి చెందిన సంగీతతో విజయ్ వివాహం 1999లో జరిగింది. విజయ్ నటుడిగా ఎదుగుతున్న సమయంలో ఆయన అభిమానిగా సంగీత పరిచయం అయ్యారు. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. కుటుంబ సభ్యుల సమ్మతితో వీరిద్దరూ పెళ్లి చేసుకున్నారు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వివాహమైన కొంతకాలం తర్వాత ఇద్దరి మధ్య అభిప్రాయ భేదాలు ప్రారంభమైనట్లు సమాచారం. గత కొన్నేళ్లుగా వీరిద్దరూ వేర్వేరుగా జీవిస్తున్నారని సినీవర్గాల్లో ప్రచారం ఉంది. ప్రత్యేకంగా విజయ్ రాజకీయాల్లోకి ప్రవేశించిన తర్వాత వ్యక్తిగత జీవితంలో మార్పులు వచ్చాయని కొందరు విశ్లేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య విభేదాలు మరింత పెరిగినట్లు తెలుస్తోంది. ఇప్పుడు సంగీత విడాకులు కోరుతూ పిటిషన్ వేయడంతో ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. విజయ్తో సినీ నటి త్రిషకు మధ్య సంబంధం ఉందంటూ గత కొంతకాలంగా ప్రచారం జోరందుకుంది. ఇటీవల తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సైతం ఇవే కామెంట్స్ చేశారు. త్రిష ఇంటిని విడిచి విజయ్ ప్రజల్లోకి రావాలంటూ బీజేపీ నాయకుడు నయినర్ నాగేంద్రన్ కామెంట్ చేశారు. ఈ వ్యాఖ్యలు తమిళనాట పెద్ద వివాదానికి దారి తీశాయి. నాగేంద్రన్ వ్యాఖ్యలపై త్రిష తీవ్రంగా స్పందించడం.. ఆ తర్వాత నాగేంద్రన్ క్షమాపణలు చెప్పడంతో వివాదం కాస్త సద్దు మణిగింది. ఇంతలో సంగీత విడాకులు కోరుతూ కోర్టును ఆశ్రయించడంతో.. విజయ్ త్రిష రిలేషన్ ఆరోపణలకు మరింత బలం చేకూరినట్లయ్యింది. విజయ్ ఇటీవలే రాజకీయాల్లోకి ప్రవేశించి తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీని స్థాపించారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా పెట్టుకుని ఆయన రాజకీయ కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నారు. ఈ సమయంలో వ్యక్తిగత జీవితంలో ఇలాంటి పరిణామం చోటుచేసుకోవడం ఆయన రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందా అనే చర్చ ప్రస్తుతం జోరందుకుంది. అయితే, విజయ్ అభిమానులు మాత్రం ఇదేమంత ప్రభావం చూపే అంశం కాదని అంటున్నారు.

**అభిమానుల్లో ఆందోళన**

తమిళ సినీ పరిశ్రమలో అత్యంత ప్రజాదరణ పొందిన నటుల్లో విజయ్ ఒకరు. ఆయన వ్యక్తిగత జీవితంపై వచ్చిన ఈ వార్త అభిమానులను కలవరపరిచింది. సోషల్ మీడియాలో అభిమానులు తమ స్పందనలు తెలియజేస్తున్నారు. కొందరు ఇది వ్యక్తిగత విషయమని వ్యాఖ్యానిస్తుండగా, మరికొందరు పూర్తి వివరాలు వెలుగులోకి రావాలని కామెంట్స్ చేస్తున్నారు. సంగీత పిటిషన్ వెనుక ఎవరున్నారన్నది అందరికీ తెలుసని, రాజకీయంగా విజయ్ ను ఎదుర్కోలేక ఈ రకంగా ఆటంకాలను సృష్టిస్తున్నారన్న వ్యాఖ్యానాలు కూడా వస్తున్నాయి.



## ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలి

ఆమనగల్లు, మహా : ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలని ప్రముఖ సంఘ సేవకులు, ఆమనగల్లు మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము అన్నారు. శుక్రవారం వెల్దండ మండలం గుండాల అంబా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల్లో పాపిశెట్టి రాము దంపతులు హాజరై అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి, చండీయాగంలో పాల్గొన్నారు. దైవ చింతనతోనే ముక్తి లభించి మానసిక ప్రశాంతత సాధ్యమవుతుందన్నారు. తద్వారా చెడు అలవాట్లు దూరం అవుతాయని ఆయన పేర్కొన్నారు. దైవచింతన, ఆధ్యాత్మిక భావాలతో సమాజ శాంతి సాధ్యమవుతుందని ప్రతి ఒక్కరు నిత్యం దైవ నామస్మరణ చేయాలని కోరారు. అనంతరం అంబా రామలింగేశ్వర స్వామి టెంపుల్ గుండాలలో కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అంబల్ల రామలింగేశ్వర స్వామి టెంపుల్ చైర్మన్ సందీప్ రెడ్డి, అర్చకులు కృష్ణయ్య శర్మ, నరహరి శర్మ, సురేష్ శర్మ, శివప్రసాద్ శర్మ, సేకర శర్మ, సంతోష్ శర్మ, శృతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ దార్ల చిత్తరంజన్ దాస్, శ్రీను నాయక్, లక్ష్మీపతి, భుజంగం, భూపతి రెడ్డి కృష్ణయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు

## సౌందరరాజన్ కన్నుమూత

- హుండీ లేకుండానే చిలుకూరు దేవాలయాన్ని నిర్వహించిన పూజారి
- సౌందరరాజన్ మృతి పట్ల పలువురి సంతాపం



హైదరాబాద్, మహా : తెలంగాణలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సౌందర్రాజన్ కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో చిలుకూరులోని ఆయన నివాసంలో శుక్రవారం తుదిశ్వాస విడిచారు. కాగా, సౌందరరాజన్ తన అర్చక సాంప్రదాయాన్ని కొనసాగిస్తూనే ఉన్నత విద్యనభ్యసించాడు. కామర్స్ లెక్చరర్‌గా పని చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ స్థాయికి ఎదిగారు. ముగ్గురు మగపిల్లల్లో రంగరాజన్ (ప్రస్తుత ఆలయ ప్రధాన అర్చకులు) రెండోవాడు. సౌందర్‌రాజన్ మరణవార్త తెలిసి అర్చకలోకం విషాదంలో మునిగిపోయింది. సౌందర్‌రాజన్ మృతికి సంతాపం తెలుపుతున్నారు. కుటుంబానికి ధైర్యం ప్రసాదించాలని దైవాన్ని వేడుకుంటున్నారు. దశాబ్దాల పాటు స్వామివారి సేవలో నిమగ్నమై, క్రమశిక్షణతో, అంకితభావంతో ఆలయ పరిపాలన నిర్వహించిన ఆయన సేవలు చిరస్మరణీయమైనవి. భక్తులతో ఎంతో మమకారంగా మెలిగి, స్వామివారి మహిమను ప్రశాంతంగా వివరిస్తూ వేలాది మందికి ఆధ్యాత్మిక మార్గదర్శకులుగా నిలిచారు.

వీసా దేవుడిగా ప్రసిద్ధి చెందిన చిలుకూరు బాలాజీ దేవాలయం అనతికాలంలోనే భక్తుల తాకిడితో కిటకిటలాడింది. అత్యంత పురాతనమైన ఆలయం కావడంతో ఆలయ విశిష్టత ఏ మాత్రం దెబ్బతినకుండా ఉండేందుకు సౌందరరాజన్ అనేక సంస్కరణలను తీసుకు వచ్చి దేవాలయాలకు ఆదర్శప్రాయుడిగా నిలిచారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు వీలుగా అనేక చర్యలను చేపట్టారు. హిందూ ధర్మ వ్యాప్తికి తన వంతు సహాయాన్ని అందించారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం పాటుపడే వారికి తన వంతు పూర్తి సహకారాన్ని సౌందరరాజన్ అందించారు.

**దేవాలయంలో హుండీ లేకుండా చేసిన మహనీయుడు**

సాధారణంగా దేవాలయమంటే హుండీ తప్పనిసరిగా ఉంటుంది. కానీ ఎంతో ప్రసిద్ధి చెందిన చిలుకూరు ఆలయంలో హుండీని ఏర్పాటు చేయకుండా దేవాలయాన్ని నిర్వహించిన సౌందరరాజన్ పూజారులను సైతం ఆశ్చర్యపోయేలా చేశారు. దేవాలయంలో హుండీని ఏర్పాటు చేస్తే భక్తుల మనోభావాలు ఎలా ఉన్నా హుండీ ద్వారా వచ్చే ఆదాయం కోసం దేవాలయాన్ని ఎండో మెంట్ తనవశం చేసుకుంటుందన్నది సౌందరరాజన్ అభిప్రాయం అందుకే ఆన చిలుకూరు దేవాలయంలో హుండీని ఏర్పాటు చేయడానికి నిరాకరించి భక్తుల మనసును కూడా దోచుకున్నారు.

# ఎంసెట్ రద్దు

(మొదటిపేజీ తరువాయి)

స్కూల్, ఇంటర్ స్థాయిల్లో పాస్ మార్కులు 35 నుండి 45 శాతానికి, డిగ్రీ, పీజీ కోర్సుల్లో 50 శాతానికి పెంచాలని ప్రతిపాదించారు. పీజీ స్థాయి వరకు ఇంగ్లీష్ మీడియంనే కొనసాగించాలని కమిషన్ సిఫార్సు చేసింది. టీచర్ల నియామకాల్లో కూడా కీలక మార్పులు సూచించారు. ఇకపై టీచర్ పోస్టుకు డిగ్రీతో పాటు బీఈడీ తప్పనిసరి చేయాలని, డీఈడీ కోర్సును పూర్తిగా ఎత్తివేయాలని కోరారు. ప్రైవేట్ కాలేజీల్లో ఫీజుల నియంత్రణకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయడంతో పాటు, బడ్జెట్‌లో విద్యకు 18% నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి సూచించారు. మొత్తం మీద ఈ సిఫార్సులు అమలులోకి వస్తే, కేవలం కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా ఇంటర్ చదువుపై దృష్టి పెడితే చాలు ఇంజనీరింగ్ సీటు సాధించవచ్చు. మరోవైపు ప్రైవేట్ కాలేజీల్లో అధిక ఫీజులను నియంత్రించేందుకు ప్రత్యేకంగా ఒక కమిషన్ ఉండాలని సూచించింది. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, ఎల్ కేజీ, యూకేజీ తరగతులను నిర్వహించాలని పేర్కొంది.

## బబ్బర్ షేర్స్‌ను ప్రజలు చెప్పులతో కొట్టారు

**యూత్ కాంగ్రెస్‌పై మోదీ ఫైర్**

ఢిల్లీ, మహా: ఢిల్లీ వేదికగా ఇటీవల జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చొక్కాలు విప్పి నిరసన చేయడాన్ని ప్రధాని నరేంద్రమోదీ తప్పుబట్టారు. కాంగ్రెస్ ఎన్ని కుతంత్రాలు చేసినప్పటికీ తమ ప్రభుత్వం మాత్రం భారతదేశ అభివృద్ధికి కృషి చేస్తూనే ఉంటుందని మోదీ అన్నారు. అలాగే దేశంలో కాంగ్రెస్ పార్టీకి మిలీనియల్స్ ఇప్పటికే తగిన గుణపాఠం చెప్పారని, ఇప్పుడు జెన్ జీ కూడా ఇదే చేయడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ సింహాలకు ప్రజలు చెప్పులతో బుద్ధి చెప్పారని అన్నారు. 'కాంగ్రెస్ బబ్బర్ షేర్స్ తాము చేసిన పనికి ప్రజలతో చెప్పు దెబ్బలు తిని వెళ్లారు' అని మోదీ విమర్శించారు. కాంగ్రెస్ తనకు కావలసినన్ని బట్టలు చింపివేయగలదు. కానీ మేం భారత్ అభివృద్ధి కోసమే పని చేస్తాం. ఏఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ చొక్కాలు విప్పడంతో, విదేశీ అతిథుల ముందు మీ అసమర్థత బయటపడింది' అని మోదీ వ్యాఖ్యానించారు.

## బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో మంత్రి కొండా సురేఖ ఆకస్మిక తనిఖీ

(మొదటిపేజీ తరువాయి)

స్వీపర్ (ఔట్‌సోర్సింగ్) జి. రాము, అటెండర్ (రెగ్యులర్) ఎస్. శ్రీహరి, స్వీపర్ (ఔట్‌సోర్సింగ్) పి. నరసింహ, సీనియర్ అకౌంటెంట్ (ఔట్‌సోర్సింగ్) జి. ప్రభాకర్ రావును విధుల నుండి తొలగించాలని నిర్ణయించారు. అర్చకుడు ఎ. శ్రీనివాస చార్యులపై చార్జ్ షీట్ మెమో జారీ చేయాలని ఆదేశించారు. అలాగే, పరిపాలనా మరియు పర్యవేక్షణ లోపాల కారణంగా దేవాలయ సూపరింటెండెంట్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో)లను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. .ఈ వ్యవహారంపై సమగ్ర నివేదిక సమర్పించాలని, తదుపరి చర్యలు తీసుకోవాలని సంబంధిత ఉన్నతాధికారులకు మంత్రి గారు ఆదేశించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవాలయ నిర్వహణ పారదర్శకంగా ఉండాలని స్పష్టం చేశారు.

## కింది కోర్టు తీర్పుతో అయిపోలేదు

(మొదటిపేజీ తరువాయి)

ఈ కేసులో సాక్ష్యాధారాలను ఎలా తారుమారు చేశారో అందరికీ తెలుసని ఆరోపించిన ఆమె, "ఒకవేళ కేజ్రీవాల్ నిజంగా నిర్దోషి అయితే, విచారణ మొదలవ్వగానే ఆ మద్యం విధానాన్ని ఎందుకు వెనక్కి తీసుకున్నారు?" అని ప్రశ్నించారు. ఈ కేసులో మనీ లాండరింగ్ జరిగినట్లు గతంలో కోర్టులు కూడా ఆందోళన వ్యక్తం చేశాయని ఆమె గుర్తు చేశారు. అలాగే కేజ్రీవాల్ ఇప్పటికీ ప్రజల ముందు డ్రామాలు చేస్తున్నారని, ఆప్ ప్రభుత్వంలో ఢిల్లీలో ఆయన చేసిన అభివృద్ధి శూన్యమని రేఖా గుప్తా విమర్శించారు. కేజ్రీవాల్ హయాంలో ప్రవేశపెట్టిన ప్రతి పథకంలోనూ ఏదో ఒక అవినీతి కుంభకోణం బయటపడుతూనే ఉందని మండిపడ్డారు. ఢిల్లీ ప్రజలు ఇప్పటికే ఆయనను ఎన్నికల్లో ఓడించి సరైన తీర్పు ఇచ్చారని, న్యాయస్థానం కూడా అంతిమంగా దోషులకు శిక్ష పడేలా న్యాయం చేస్తుందని తాను నమ్ముతున్నట్లు ఢిల్లీ సీఎం రేఖా గుప్తా మీడియాతో చెప్పుకొచ్చారు.

# ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ట్విస్ట్

**తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టులో సీబీఐ పిటిషన్**

ఢిల్లీ, మహా : ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో 23 మందికి ట్రయల్ కోర్టు ఇచ్చిన క్లీన్ చిట్ వ్యవహారంలో ట్విస్ట్‌లు చోటుచేసుకున్నాయి. ట్రయల్ కోర్టు నిర్ణయంపై సీబీఐ హైకోర్టును ఆశ్రయించింది. ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్, మాజీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, మాజీ ఎంపీ కవిత సహా 23 మందికి క్లీన్ చిట్ ఇవ్వడంతో పాటు నిర్దోషులుగా తేల్చడాన్ని సవాల్ చేస్తూ.. సీబీఐ హైకోర్టులో పిటిషన్ వేసింది. దీంతో ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో న్యాయ పోరాటం మళ్లీ ప్రారంభం అయింది. ట్రయల్ కోర్టు ఇచ్చిన 'క్లీన్ చీట్' ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ సీబీఐ అప్పీల్ దాఖలు చేసింది. కేసు దర్యాప్తులో లభించిన కీలక సాక్ష్యాలను ట్రయల్ కోర్టు పరిగణనలోకి తీసుకోలేదని, నిందితులను విడిచిపెట్టడం వల్ల దర్యాప్తు సంస్థ నైతిక స్థైర్యం దెబ్బతింటుందని సీబీఐ తన పిటిషన్‌లో పేర్కొంది. హైకోర్టు ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించి, స్టే విధిస్తే కేజ్రీవాల్, కవిత సహా ఇతర నేతలకు వచ్చిన ఉపశమనం తాత్కాలికమే అవుతుంది. ఈ పరిణామంతో ఈ కేసుపై న్యాయ పోరాటం మళ్ళీ మొదటికి వచ్చినట్లవుతుంది.

# అఫ్ఘాన్- పాక్ మధ్య యుద్ధం

(మొదటిపేజీ తరువాయి)



అఫ్ఘాన్‌పై బహిరంగ యుద్ధం ప్రారంభించినట్లు పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. రెండుదేశాల మధ్య ఉద్రిక్తతలు పతాకస్థాయికి చేరాయి.

**19 పాక్ సైనిక పోస్టులు, 2 స్థావరాలను ధ్వంసం చేసినట్లు పేర్కొన్న అఫ్గాన్**

గత ఆదివారం పాక్ జరిపిన వైమానిక దాడికి ప్రతీకారంగా గురువారం రాత్రి అఫ్గాన్ తాలిబన్ దళాలు సరిహద్దులోని పాక్ మిలిటరీ స్థావరాలపై ముందుగా విరుచుకుపడ్డాయి. 4 గంటల పాటు కొనసాగించిన ఈ ఆపరేషన్‌లో 19 పాకిస్థానీ సైనిక పోస్టులు, 2 స్థావరాలను ధ్వంసం చేసినట్లు అఫ్గాన్ పేర్కొంది. పాకిస్థానీ సైనికుల మృతదేహాలతో పాటు కొందరు సైనికులను సజీవంగా తమ దేశంలోకి తీసుకొచ్చినట్లు ప్రకటించింది.

## కఠోరంగ శ్రమించి లక్ష్యాన్ని సాధించి..

# ఓటమినే గెలుపుగా మార్చుకున్న ధీశాలి..

## కరీంనగర్ కొత్త కలెక్టర్ ప్రయాణం ఆదర్శనీయం..

### పట్టుదలకు మారుపేరు.. కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన చిత్తా మిశ్రా..

### మంత్రి పొన్నం ప్రభాకర్, సిపి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ని మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్..







**కరీంనగర్ మహా :** కఠోరంగ శ్రమించి తన లక్ష్యాన్ని సాధించారు. ఓటమి ఐదుసార్లు ఎదురైన పట్టు వదలకుండా ధైర్యం కోల్పోకుండా ఉన్నత శిఖరాలను అధిరోహించారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించి శభాష్ అనిపించుకున్నారు. ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా ఏ మాత్రం భయపడకుండా ఎదురు నిలిచి ముందుకు సాగారు. ఇంతకీ ఎవరంటే కరీంనగర్ జిల్లా నూతన కలెక్టర్ గా నియమితులైన చిత్రా మిశ్రా ప్రస్థానం ఇది. కరీంనగర్ జిల్లా నూతన కలెక్టర్ గా నియమితులైన చిత్రా మిశ్రా కేవలం ఒక ఐఏఎస్ అధికారిణి మాత్రమే కాదు, ఓటమిని జయించి శిఖరాన్ని చేరుకున్న ధీశాలిగా ఆమె ఆల్ ఇండియా 20వ ర్యాంకు సాధించి సంచలనం సష్టించారు. వరుసగా ఐదు ప్రయత్నాల్లో ఓటమి ఎదురైనప్పటికీ కుంగిపోకుండా, తన ఆరో ప్రయత్నంలో అగ్రస్థానంలో నిలిచి సివిల్స్ ఆస్పిరెంట్లకు ఆదర్శంగా నిలిచారు. ఒకటి రెండుసార్లు ఓటమి చెందితే మనోధైర్యాన్ని కోల్పోయే ఈ రోజుల్లో ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఐదుసార్లు ఓటమి అంచున నిలిచిన పట్టు వదలని ధీశాలిగా లక్ష్యాన్ని సాధించి మన్ననలు అందుకున్నారు.

**ఢిల్లీలోని ప్రతిష్టాత్మక 'లేడీ శ్రీరామ్**

కాలేజీ నుండి హిస్టరీలో బి.ఏ (ఆనర్స్) పూర్తి చేసిన ఆమె, సెయింట్ స్టీఫెన్స్ కాలేజీ నుండి మోడరన్ హిస్టరీలో మాస్టర్స్ పట్టా పొందారు. 2019 బ్యాచ్ కి చెందిన ఈ యువ ఐఏఎస్ అధికారిణి, తన స్వల్ప వ్యవధిలోనే సమర్థవంతమైన పాలకురాలిగా అత్యుత్తమ గుర్తింపు పొందారు. ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్గా బాధ్యతలు చేపట్టిన మొదటి రెగ్యులర్ మహిళా ఐఏఎస్ అధికారిణిగా ఆమె రికార్డు సృష్టించారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు, విద్య, వైద్య రంగాల్లో ఆమె విశేష కృషి చేశారు. తన కెరీర్ ప్రారంభంలో నాగర్ కర్నూల్ జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్ గా శిక్షణ పొందారు. అనంతరం నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా పనిచేసి క్షేత్ర స్థాయి పాలనపై పట్టు సాధించారు. ప్రస్తుతం కరీంనగర్ జిల్లా కలెక్టర్ గా నియమితులు అయ్యారు.

**కరీంనగర్ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన చిత్రా మిశ్రా**

కరీంనగర్ జిల్లా నూతన కలెక్టర్ గా చిత్రా మిశ్రా శుక్రవారం కలెక్టరేట్ ఛాంబర్ లో బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చిత్రా మిశ్రాను కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, ఏవో సుధాకర్ , పలువురు జిల్లా అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు, పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. శుక్రవారం సాయంత్రం కరీంనగర్ పర్యటనకు వచ్చిన రాష్ట్ర బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రమ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. అంతకుముందు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, జిల్లా ప్రధాన న్యాయమూర్తి యేసు శివ కుమార్ జిల్లా కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పూల మొక్కలు అందించారు. జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ కు మంత్రి సిపి ప్రధాన న్యాయమూర్తి అభినందనలు తెలిపారు.



### పూసల కులస్తుల సమస్యలు
## పరిష్కరించాలి

**అమనగల్లు, మహా,:** పూసల కులస్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంఘం నాయకులు మున్సిపల్ ఛైర్మన్ పద్య నాయక్కు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించిన అనంతరం, కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని ఇతర మౌలిక వసతులు కల్పించాలనివిజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు పూసలి సత్యం,డేరంగుల వెంకటేష్, అధ్యక్షులు నూతన గంటి వెంకటేష్,నారాయణ,నరసింహ, బాలయ్య, అంజి,మోహన్, నరేందర్, సాయి, మహేష్, మహిళలు మంగమ్మ,శిరీష,మైసమ్మ తదితరులు పాల్గొన్నారు.




### నానాజీపూర్ నుంచి బస్సు సర్వీస్ ను
### తోకల శ్రీనివాస్ రెడ్డి
## ప్రారంభించారు

**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ మండలం నానాజీపూర్ గ్రామంలో బస్సు సర్వీస్ కొరకు గ్రామస్తులు విద్యార్థులు కొన్ని నెలలుగా తీవ్ర ఇబ్బంది పడ్డారు. సర్పంచ్ ఎన్నికల అనంతరం బస్సు సర్వీసు అందిస్తామని బిజెపి నాయకులు తోకల శ్రీనివాస్ రెడ్డి గ్రామస్తులకు హామీ ఇచ్చారు. నియోజకవర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి ( టి ఎస్ ఆర్ టి సి ) ఉన్నత అధికారులతో పలుమార్లు చర్చించి బస్సు సర్వీసును శుక్రవారం గ్రామం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలలో అభివృద్ధి బిజెపి పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు.ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సహకారంతో నానాజీపూర్ గ్రామానికి బస్సు సర్వీసు ను ప్రారంభిస్తున్నామని తెలిపారు. గ్రామస్తులందరి తరపున ఎంపీ కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సురేష్‌రాజు, ఉప సర్పంచ్ విజయ్ కుమార్, వంగ మహేందర్ రెడ్డి, మునుగుల రాజిరెడ్డి ,వార్డు సభ్యులు మున్నూరు సిద్దులు, మైలారం రాధికాశ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి ,సిద్దేశ్వర్ గౌడ్, సంతోష్ కుమార్, వెంకటేష్ గౌడ్,మైలారం దర్శన్, మైలారం కృష్ణ, శ్రీనివాస్ గౌడ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### సర్పంచ్ పదవిని ప్రజల విశ్వాసానికి ప్రతీకగా భావించి
## నిబద్ధతతో పని చేయాలి

**డాక్టర్ వంశీకృష్ణ**




**నాగర్ కర్నూలు జిల్లా మహా :** నాగర్ కర్నూల్ ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తేనే రాజకీయంగా ఉన్నత స్థానాలకు ఎదగవచ్చు నాగర్ కర్నూల్ జిల్లా ఐడీఓసీ సమావేశ మందిరంలో నూతన సర్పంచులకు శిక్షణ తరగతులుఅచ్చంపేట నియోజకవర్గంలోని 5 మండలాల సర్పంచులు శిక్షణలో పాల్గొన్నారు గ్రామాభివృద్ధే లక్ష్యంగా మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలుపై దృష్టి సారించాలి పారదర్శక పాలనతో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలిసర్పంచ్‌గా నిబద్ధతతో పనిచేస్తే భవిష్యత్తులో ఎంపీపీ, జడ్పీటీసీ, ఎమ్మెల్యే అవకాశాలు పంచాయతీరాజ్ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచన గ్రామ స్థాయి నుంచే ప్రజాసేవ ప్రారంభమై రాజకీయ ఎదుగుదలకు పునాది వేస్తుంది అభివృద్ధి పనులు తన దృష్టికి తీసుకువస్తే మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, ఏవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.



### ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంకు
## పనుల పరిశీలన

- నాణ్యతతో, గడువులోపు పూర్తి చేయాలి..
- ఎమ్మెల్యే పాయం

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలోని అరుంధతి నగర్‌లో సుమారు రూ.60 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంకు నిర్మాణ పనులను శుక్రవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన, నిర్మాణం నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ వాటర్ ట్యాంకు నిర్మాణంతో అరుంధతి నగర్‌తో పాటు సమీప ప్రాంతాల ప్రజలకు తాగునీటి సమస్యలు తీరనున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించిన ఆయన, ప్రజా అవసరాల మేరకు మరిన్ని మౌలిక వసతుల పనులు చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వర్లు, ఏఈ లక్ష్మీ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ అరుంధతి, మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, సంతసింగారం ఉపసర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, మైనార్టీ అధ్యక్షులు రహీం పాషా, వార్డు సభ్యురాలు మానసతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### చెంచుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి
## ఆర్‌డీటీతో ఒప్పందం..

- చెంచుపెంటలో ఇంటింటి సర్వే ను సమర్థవంతంగా పూర్తి చేయాలి..
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**నాగర్ కర్నూల్ జిల్లా మహా :** అచ్చంపేట చెంచు పెంటల్లో ఆదివాసీ చెంచులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంమంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లు, ప్రధానమంత్రి జనధన్ పథకంలో కేటాయించిన లబ్ధిదారుల ఇండ్లను రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (RDT) స్వచ్ఛంద సంస్థ తో నిర్మాణాలను ఎంవోయూ కుదుర్చుకుని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ తన ఛాంబర్ లో ఐటీడీఏ, గృహ నిర్మాణా శాఖల అధికారులు, ఆర్ డి టి సంస్థ ప్రతినిధులతో కలెక్టర్ చెంచుల ఇండ్ల నిర్మాణాలు, చెంచు ప్రజల సమగ్ర సర్వే నిర్వహణపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ.....రాష్ట్ర ప్రభుత్వం చెంచు పెంటల్లో చెంచు ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినప్పటికీ ఆర్థిక స్తోమత లేకపోవడంతో స్వయంగా ఇండ్లు నిర్మించుకోలేకపోతున్నందున అర్హులైన చెంచు ప్రజలకు ఇల్లు నిర్మించాలని ఉద్దేశంతో ఆర్డిటి సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇండ్ల నిర్మాణాలను రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మెరకే ఇందిరమ్మ ఇండ్లను వేగవంతం చేయాలని సంస్థ ప్రతినిధులకు సూచించారు.ఒక్కో ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు చొప్పున నిర్మాణ సంస్థకు చెల్లింపులు నేరుగా లబ్ధిదారుల తో కాకుండా ఐటీడీఏ ద్వారా చెల్లించేలా అందుకు అవసరమైన ఎంవోయూను నిబంధనలను అనుసరిస్తూ ఆ మేరకు కుదుర్చుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఐదు జిల్లాల పరిధిలో లబ్ధిదారులైన చెంచులకు 1488 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని, నాగర్ కర్నూల్ జిల్లాలో 536 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని ఆయా మంజూరైన ఇండ్లను నిర్మించి వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.అదేవిధంగా ఐటీడీఏ పరిధిలోని 5 జిల్లాల పరిధిలో 2156 చెంచుపెంటల్లో నివసించే ప్రజల సమగ్ర సర్వేను నిర్వహించి అప్లోడ్ చేయాలని కలెక్టర్ ఆర్ డి టి సంస్థ ప్రతినిధులకు సూచించారు. సర్వేలు 42 అంశాలను పరిగణనలోకి తీసుకుని క్షేత్ర స్థాయిలో ప్రతి ఇంట్లో నివసించే ప్రజలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అందే విధంగా ప్రతి ఒకరికి ఆధార్, రేషన్ కార్డు, జన్ మన్ కార్డ్, ఆయుష్మాన్ భారత్, కిసాన్ కార్డ్, తదితర అన్ని ప్రభుత్వ పథకాల కు సంబంధించిన కార్డులు ప్రతి ఒక్కరికి అందించేందుకు అనుగుణంగా రానున్న మాసం రోజుల్లో క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహించి ప్రభుత్వ సైట్ లో అప్లోడ్ చేయాలని ఆర్డిటి సంస్థ ప్రతినిధులకు కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో జిల్లా గృహ నిర్మాణ సంస్థ పిడి సంగప్ప, ఐటీడీఏ మేనేజర్ జాఫర్ హుస్సేన్, ఆర్డిటి సంస్థ హ్యాబిటేషన్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, భవ్య నారాయణ, నాగరాజు, రామ్మోహన్, రాధ, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులచే సైన్స్ ల్యాబ్ ఏర్పాటు...




**నాగర్ కర్నూల్ జిల్లా మహా :** నాగర్ కర్నూల్ బిజినపల్లి మండల పరిధిలోని పాలెం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో విద్యార్థినీ విద్యార్థులలో సైన్స్ పట్ల అవగాహన శాస్త్రీయ దృక్పథం పెంచడంలో భాగంగా సైన్స్ ల్యాబ్ ను ఏర్పాటు చేసుకున్నారు. శాస్త్రీయ విజ్ఞానాన్ని విద్యార్థులకు త్వరితగతీగ చేరుటకు ఎంత ఉపయోగపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సయ్యద్ మైనోద్దీన్,సైన్స్ ఉపాధ్యాయులు పూర్ణ చంద్రకళ,రాజు, రాఘవేందర్,వెంకట్ నర్సమ్మ,ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



## మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు

**ఆమనగల్లు, మహా :** ఇఫ్తార్ విందులు మతసామరాస్యానికి హిందూ ముస్లింల ఐక్యతను సూచిస్తాయని రామ్ రెడ్డి లయన్ ఆసుపత్రి ఛైర్మెన్ వి దామోదర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆమనగల్లు మున్సిపాలిటీ చైర్మన్ పత్యానాయక్, సంఘ సేవకుడు అయిదవ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము ను శాలువా పూలమాలతో లయన్స్ క్లబ్ పిఆర్ఓ, విద్యానగర్ కాలనీ అధ్యక్షుడు ఎంఏ పాషా ఘనంగా సన్మానించారు.శుక్రవారం ఆమనగల్లు పట్టణానికి చెందిన లయన్స్ క్లబ్ పిఆర్ఓ, విద్యానగర్ కాలనీ అధ్యక్షుడు ఎంఏ పాషా ఇచ్చిన ఇఫ్తార్ విందుకు రామ్ రెడ్డి లయన్స్ ఐ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ బి దామోదర్ రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. రంజాన్ మాసాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని, నెల రోజులపాటు కఠిన నియమాలతో అల్లాను ప్రార్థించే ముస్లింల భక్తి విశేషమని పేర్కొన్నారు. అల్లా దయతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు చుక్కా అల్లాజీ గౌడ్ సుదర్శన్ రెడ్డి పూసల సత్యం మల్లేష్ తదితరు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరుతో సత్తుపల్లి మోడల్ కాలనీ



**సత్తుపల్లి, మహా:** తెలంగాణ రాష్ట్రంలో నిరుపేద కుటుంబాలకు సొంత ఇంటి కల నెరవేరుస్తూ ఇందిరమ్మ ఇల్లు నామకరణంతో ఐదు లక్షల ఆర్థిక సహాయంతో పేదవాడికి ఇంటి నిర్మాణంతో శాశ్వత చిరునామా అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధిని మరవకుండా మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఏర్పాటు చేసిన 67 గృహాల సముదాయానికి ఇందిరమ్మ రేవంత్ రెడ్డి కాలనీగా నామకరణం చేశారు. ప్రభుత్వం చేసిన మేలు మర్చిపోకుండా ఇందిరమ్మ రేవంత్ రెడ్డి పేర్లు కాలనీకి పెట్టడంతో స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్ గ్రామస్తులను అభినందించారు. రేకుల ఇళ్లనుండి డబల్ బెడ్ రూమ్ లలోకి సామూహిక గృహప్రవేశాలు చేసిన కొత్తూరు గ్రామ ప్రజలకు ఎమ్మెల్యే రాగమయి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.పీ.డీ.వో, ఎమ్మార్వో, హౌసింగ్ ఏ.ఈ, సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రెహానా బేగం, వైస్ చైర్మన్ బొంతు సుమలత, ఏ.ఎం.సీ చైర్మన్ దోమ ఆనంద్, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చెన్నారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శివ వేణు, సత్తుపల్లి పట్టణ కౌన్సిలర్లు, కొత్తూరు గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ రామ్మోహన్ రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, సత్తుపల్లి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### పర్ణశాలను సందర్శించిన
### మిషన్ భగీరథ సి ఈ దంపతులు

**మహా దుమ్ముగూడెం:** ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవాలయాన్ని మిషన్ భగీరథ సి ఇ సురేష్ బాబు దంపతులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా వారికి ఆలయ అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి ఆలయ గర్భగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని కుటీర, నార చీరల ప్రదేశాలను తిలకించి వాటి యొక్క విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వారి వెంట డిఈఈ ఏసుబాబు, డిఈ రవితేజ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### నాగర్ కర్నూల్ మండలం కుమ్మెర గ్రామంలో
## రెండు నెలల పసిబిడ్డ మృతి ఘటన దురదృష్టకరం

**ఎంపీ మల్లు రవి**



**నాగర్ కర్నూల్ మహా :** ఘటనకు బాధ్యులైన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం పసిపాప మరణాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవడం తగదు ప్రభుత్వంపై బురద చల్లడం, బదనాం చేయడం సరికాదని హెచ్చరిక వాస్తవాలు తెలుసుకునే వరకు ఏ రకమైన చర్చకైనా సిద్ధమని ప్రకటనఎంపీ ఆధ్వర్యంలో ప్రత్యేక నిజ నిర్ధారణ బృందం కుమ్మెర గ్రామ పర్యటన గ్రామ పెద్దలు, యువకులు, మహిళలతో సమావేశమై వివరాల సేకరణఘర్షణ కేసులో తొలుత పసికందు ప్రస్తావన లేదని వెల్లడింపు 21వ తేదీన ఇచ్చిన ఫిర్యాదులో పసికందు విషయాన్ని పేర్కొన్నట్లు వివరణ ఫిర్యాదు ఆధారంగా 307 సెక్షన్ కింద కేసు నమోదు బాధితురాలు మౌనిక కులంపై వివరణ: ఎస్సీ కాదని, బిసిఏగా రెవెన్యూ అధికారుల స్పష్టం గ్రామంలో కుల వివక్ష లేదని గ్రామస్థుల సమక్షంలో చర్చ ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల ఆందోళనను తప్పుపట్టడం లేదని వ్యాఖ్య వాస్తవాలు తెలుసుకొని పోరాటం చేయాలని సూచనబెనిఫిట్ ఆఫ్ డౌట్ కింద కుటుంబానికి రూ.1 లక్ష నగదు, ఇల్లు, ఉద్యోగం హామీ జిల్లా ఎస్పీ, కలెక్టర్‌లతో నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని సమాచార బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పార్టీలకతీతంగా పోరాటం చేస్తామని హామీ గత ప్రభుత్వంలో పోలీస్ రాజ్యం నడిచిందని, ప్రస్తుతం అలాంటిది లేదని వ్యాఖ్య తెలంగాణకు చెడ్డపేరు తేవద్దని, రాజకీయాలు చేయవద్దని పిలుపు విలేకరుల సమావేశంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

### మొయినాబాద్ మున్సిపాలిటీ చైర్మన్,
## వైస్ చైర్మన్, కౌన్సిలర్ల సన్మాన సభ




**మొయినాబాద్ మహా:** మొయినాబాద్‌లోని అంజనీదేవి గార్డెన్ లో శుక్రవారం మొయినాబాద్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ దుబ్బ సోనియా దర్శన్, వైస్ చైర్మన్ గరుగు రాజు మరియు అన్ని పార్టీల కౌన్సిలర్లకు సన్మాన సభ ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి హాజరయ్యారు. మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీంభరత్, మాజీ జిల్లా పరిషత్ చైర్పర్సన్ తీగల అనితా రెడ్డి, మాజీ జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్, టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.అలాగే మొయినాబాద్ మండల అధ్యక్షుడు మానయ్య, షాబాద్ దర్శన్, వైస్ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి, సత్యనారాయణ, చేవెళ్ల యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పెంట రెడ్డి, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రసాద్, మొయినాబాద్ మండల సీనియర్ నాయకులు మరియు కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.సన్మాన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ మొయినాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.సభలో నాయకులను శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్చాలు అందజేశారు

## ప్రజలకు సమగ్ర నాణ్యమైన ఆరోగ్య సేవలు

**100 రోజుల ఆరోగ్య సేవల ప్రత్యేక కార్యక్రమం**

**జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే లలితాదేవి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వందరోజుల సమగ్ర ఆరోగ్య సేవల ప్రత్యేక కార్యక్రమం మార్చి 4 నుండి చేపట్టడం జరుగుతుందని లలితా దేవి అన్నారు. రంగారెడ్డి జిల్లాలో ప్రజలకు మరింత సమగ్ర మరియు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించేందుకు వందరోజుల ఆరోగ్య కార్యక్రమాన్ని మూడు దశలలో అమలు చేయనున్నట్లు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే లలితాదేవి తెలిపారు. మొదటి దశ మార్చ్ 4 నుండి మార్చి 31 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్పెషలిస్ట్ వైద్యులు నిర్ణయించిన తేదీలలో క్యాంపులు ఏర్పాటు చేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పరీక్షిస్తారు. ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించడానికి సన్నాహక సమావేశము జిల్లా డిప్యూటీ జిల్లా వైద్యాధికారుల మరియు ప్రోగ్రాం అధికారులతో కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులకు జూము మీటింగ్ నిర్వహించడం జరిగింది. మొదటి దశలో మాతృ మరియు మహిళా ఆరోగ్యము శిశు ఆరోగ్యంలో భాగంగా అనీమియా స్క్రీనింగ్ మరియు చికిత్స ఐఎఫ్ఏ మాత్రల పంపిణీ హైరిస్క్ గర్భిణీల గుర్తింపు మరియు పర్యవేక్షణ, ప్రసవానంతరం 14 రోజులలో పు గృహ సందర్శనలు మెన్సెస్ పరిశుభ్రత పై అవగాహన కార్యక్రమాలు, స్థన మరియు గర్భాశయ ముఖ క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమంలో నిపుణులైన గైనకాలజిస్ట్ లచే పరీక్షించి గుర్తించిన వారికి చికిత్స అందజేయడం జరుగుతుంది. అదేవిధంగా పూర్తి టీకాల కార్యక్రమం బలోపేతం జీరో డోస్ పిల్లల గుర్తింపు మరియు ట్రాకింగ్ విటమిన్ ఎ పంపిణీ చిన్న పిల్లల డాక్టర్ లచే గుర్తించి చికిత్స అందజేస్తారు. యువత కోసం అనీమియా నివారణ చర్యలు పరీక్షల ఒత్తిడి నివారణ చర్యలు పరీక్షల ఒత్తిడి నివారణ కౌన్సిలింగ్ మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రత్యేక జేరియాట్రిక్ క్యాంపులు నిర్వహించి రక్తపోటు మధుమేహం మరియు ఇతర దీర్ఘకాలిక వ్యాధుల స్క్రీనింగ్ చేసి అవసరమైన వారికి రిఫరల్ సేవలు అందించడం జరుగుతుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అంగన్వాడీలు సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసి ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ పట్టణ స్థాయిలో విస్తృత స్క్రీనింగ్ మరియు అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ఆర్ బిఎస్ కే వైద్యుల ద్వారా రెసిడెన్షియల్ పాఠశాలలో కంటి పరీక్షలు రక్తహీనత పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారులు డాక్టర్ గీతా డాక్టర్ రాధిక, డాక్టర్ పాపారావు, డాక్టర్ లక్ష్మీప్రసన్న, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శిభా హయత్, డెమో శ్రీనివాసులు, సూపర్వైజర్ లు తదితరులు పాల్గొన్నారు.

ANN తెలుగు
మహా పత్రిక
శనివారం, హైదరాబాద్
28-02-2026

మహా ప్రత్యేకం





# ఆదర్శ మున్సిపాలిటీగా ఆదిలాబాద్

## అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు..ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్









**ఆదిలాబాద్, మహా:** ఆదిలాబాద్ పట్టణ సర్వతోముఖాభివృద్ధే తన లక్ష్యమని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. పట్టణ ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పరిష్కారానికి అందరి సహకారంతో కృషి చేస్తానన్నారు. ప్రజలు కూడా పాలకవర్గానికి అన్నివిధాల సహకరించాలని కోరారు. ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేయడమే తన ధ్యేయమంటున్న ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ తో మహాపత్రిక ప్రత్యేక ఇంటర్వ్యూ....

**మహా: ముందుగా మీకు మహా తరపున శుభాకాంక్షలు**

అనూష : ధన్యవాదాలు .

**మహా : ముందుగా మీ విజయానికి సహకరించిన అంశాలేంటి?**

**అనూష :** మేము నమ్ముకున్న మా వార్డు ప్రజలు. నా భర్త బండారి సతీష్ పదేళ్లుగా 45వ వార్డు కౌన్సిలర్ గా అందించిన సేవలు. నిత్యం ప్రజలలో ఉండటం, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వారికి అండగా ఉండటంతో ఇండిపెండెంట్ గా బరిలోకి దిగినా మమ్మల్ని నమ్మి ఆశీర్వదించారు. మా 45వ వార్డు ప్రజలందరికి ధన్యవాదాలు.

**మహా : మున్సిపల్ చైర్ పర్సన్ అవుతానని మీరు ఊహించారా.?**

**అనూష :** అస్సలు ఊహించలేదు. ఇందుకు ప్రధానంగా చెప్పుకోవల్సింది అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనన్న, డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్ ఇతర కాంగ్రెస్ పెద్దలు. వారి ప్రోత్సాహం వల్లే నాకీ పదవి దక్కింది. ఇందుకు కంది శ్రీనన్నకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేస్తున్నా.అలాగే సహకరించిన బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు, ఎంఐఎం నాయకులు కౌన్సిలర్లు ఇండిపెండెంట్ కౌన్సిలర్లకు నా ధన్యవాదాలు.

**మహా: పట్టణ పాలక వర్గంలో ప్రధాన బాధ్యతల్లో కూర్చున్నారు. ఎలా అనిపిస్తుంది.?**

**అనూష :** ఒక వైపు సంతోషంగా ఉన్నా మరోవైపు ఛాలెంజింగ్ గా తీసుకుంటున్నా. అందరూ ఎంతో విశ్వాసంతో నమ్మకంతో నాకీ బాధ్యతలు కట్టబెట్టారు. మున్సిపల్ అభివృద్ధికి అందరి సహకారంతో నా శయ శక్తులా కృషి చేస్తా. రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు అహర్నిషలు కష్టపడుతా.

**మహా: మున్సిపల్ అభివృద్ధికి ప్రణాళికలు ఏవైనా తయారు చేసారా.? పట్టణ సమస్యలపై అవగాహన పెంచుకున్నరా.?**

**అనూష :** నా భర్త బండారి సతీష్ కు మున్సిపల్ పై ఎంతో పట్టుంది.ఇప్పుడిప్పుడే అన్ని విషయాలు నేర్చుకుంటున్నాను. ఆయన నాకు అన్నివిధాల సలహాలిస్తున్నారు. నా సందేహాలన్నీ తీరుస్తున్నారు. ఆయన మాజీ కౌన్సిలర్ , మాజీ ఫ్లోర్ లీడర్ కావడం తో మున్సిపల్ పాలనాపరమైన ప్రతీ విషయంపై ఇంటి వద్ద చర్చిస్తున్నాము.

**మహా: వేసవి వస్తోంది. పట్టణ తాగునీటి సమస్యను ఏ విధంగా పరిష్కరిస్తారు. ఇందుకోసం ఏదైనా కార్యాచరణ సిద్దం చేసారా.?**

**అనూష :** వాస్తవంగా అయితే ప్రస్తుత తాగునీరు పట్టణ ప్రజల అవసరాలకు సరిపోవడంలేదు. నీటి లభ్యత పెరిగేలా ప్రయత్నిస్తాం. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి పాలక వర్గ సభ్యులు,అధికారులతో కలిసి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తాం. ప్రజల సహకారంతో అధిగమిస్తాం. నిన్ననే ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు కు ఇదే విషయమై నిధుల కోసం ఒక మెమోరాండ్ ఇచ్చాం.ఆయన కూడా సానుకూలంగా స్పందించారు.మున్సిపల్ , ప్రభుత్వ నిధులతో సమస్యను పరిష్కరిస్తాం.అలాగే నీరు వృధా చేయవద్దని ప్రజలకు కూడా నేను విజ్ఞప్తి చేస్తున్నా.నీటిని పొదుపుగా వాడుకుంటే భవిష్యత్తులో తాగునీటి సమస్య అనేది ఉండదని భావిస్తున్నా.

**మహా: పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుపరచడానికి ఎలాంటి చర్యలు చేపడతారు..?**

**అనూష :** ఇది చాలా ముఖ్యమైంది. ఆదిలాబాద్ ను క్లీన్ టౌన్ గా మార్చాలన్నది నా ఆశ. ఇందుకోసం ప్రతీ నెల అవుట్ సోర్సింగ్ శానిటేషన్ విభాగానికి దాదాపు 78 నుండి 80 లక్షలు చెల్లిస్తున్నా అనుకున్న ఫలితం రావడం లేదని గుర్తించాం. దీనిపై అధికారులు సానిటేన్ విభాగ సిబ్బందితో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేస్తాం. ఆశించిన పలితం దక్కేలా కృషి చేస్తాం. ప్రజలు కూడా చెత్త ఎక్కడ పడితే అక్కడ బజారులో వేయకుండా మీ ఇంటివద్ద కొచ్చే చెత్త వాహనంలోనే వేయాలని కోరుతున్నా. ఒక వేళ బండి మీ ఏరియాలోకి సరిగా రాకపోతే వార్డు కౌన్సిలర్ లేదా నాదృష్టికి తీసుకువచ్చినా తగిన చర్యలు తీసుకుంటాం. ఇంకా ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్ వాడకం నిషేధం పై కూడా దృష్టి పెట్టాం. త్వరలో అధికారులతో చర్చించి పట్టణంలో పూర్తిగా ప్లాస్టిక్ నిషేధం అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం.

**మహా: ఇంకా ఏమేం చేయాలనుకుంటున్నారు.**

**అనూష :** ఆదిలాబాద్ మున్సిల్ పరిధిలోని ప్రతీ వార్డును సందర్శిస్తా..అక్కడి మౌళికసదుపాయాలపై పరిశీలన చేస్తా. త్రాగునీరు , రోడ్లు, మురకికాలువలు, పారిశుధ్యనిర్వహణ, వీధి దీపాలు వంటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తా. మున్సిపల్ ఆదాయ వనరులు పెంచి అన్ని సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తా. ప్రజలు కూడా మున్సిపల్ పాలనా నిర్వహణ కు తగిన సహకారమందించాలి. ఇంటిపన్నులు, నల్లా బిల్లులు చెల్లించాలి. అందరూ బాధ్యతగా వ్యవహరించి పాలక వర్గానికి సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను. పార్టీ నియోజకవర్గ ఇన్ ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి సహకారంతో రాష్ట్ర ముఖ్యమంత్రిని, ప్రభుత్వ పెద్దలను కలిసి మునిసిపాలిటీకి మరిన్ని నిధులు తీసుకొచ్చి పనులను ముందుకు తీసుకెళ్తాం.

**మహా: మున్సిపల్ ఆస్తుల పరిరక్షణ కోసం ఎలాంటి చర్యలు చేపడతారు.?**

**అనూష :** మున్సిపల్ కు సంబంధించిన ఆస్తులు కాపాడేందుకు అందరి సహకారం తీసుకుంటా. ఎక్కడెక్కడ భూములు ఆక్రమణకు గురైనవో గుర్తించి అధికారుల పాలక వర్గం సమావేశమై తిరిగి మున్సిపల్ పరమయ్యేందుకు ప్రయత్నిస్తా. ఇందుకు ఇవసరమైతే న్యాయ సహాయం కూడా కోరతాం. అలాగే ఏవైతే ఇంకా మున్సిపల్ పరిధిలో ఉన్న భూములు కానీ రోడ్లు కానీ ఆక్రమణకు గురి కాకుండా అందరి సహకారంతో కాపాడుకుంటాం.

**మహా: మీ విద్యాభ్యాసం కుటుంబ నేపథ్యం ?**

**అనూష :** మాది బోథ్ నియోజకవర్గం లోని సొనాల .పదవ తరగతి వరకు అక్కడే చదివా.ఇంటర్ బజార్ హత్నూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చదివా. డిగ్రీ ప్రైవేట్ కాలేజీలో చదువుకున్నా. చిన్నప్పటినుండి చదువులో ముందంజలో ఉండేదాన్ని. టీటీసీ లో కూడా సీట్ వచ్చినా కుటుంబ కారణాల వల్ల చేయలేక పోయినాను. ఇక పిల్లల విషయానికోస్తే నాకు ఇద్దరు పిల్లలు కూతురు అమిత 5వతరగతి , కుమారుడు శివకృష్ణ 1వ తరగతి చదువుతున్నారు. కుటుంబ సభ్యుల సహకారం ఉండటం వల్లే నేను ఈ బాధ్యతలను సమర్ధ వంతంగా నిర్వర్తించగలుగుతున్నాను.

# డ్వాక్రా రుణాల్లోని అక్రమం బట్టబయలు

- లేని వ్యక్తుల పేరుతో గ్రూపులను సృష్టించిన అక్రమార్కులు
- వినాయక్,స్వరాజ్ గ్రూపుల పేరుతో రూ.12 లక్షలకు టోకరా
- బ్యాంక్ సొమ్ము కాజేసినా వారిపై చర్యలేవి
- అక్రమార్కులను కాపాడే ప్రయత్నంలో అధికారులు?




**అయ్యా.. మేమసలు అప్పనే తీసుకోలేదు**

స్వరాజ్ పేరుతో ఉన్న గ్రూపు ద్వారా మేము తీసుకున్న బాకీలను గతంలోనే చెల్లించడం జరిగింది.రెండోసారి మా ప్రమేయం లేకుండా తీసుకున్న అప్పు తో మాకు ఎటువంటి సంబంధం లేదు.అప్పు కోసం మేము ఏ బ్యాంకుకు కూడా వెళ్ళలేదు.మా ప్రమేయం లేకుండానే మా పేర్లతో గ్రూపును కొనసాగించిన వారిపై సంబంధిత అధికారులే చర్యలు తీసుకోవాలయ్యా.- గుర్రం మంగమ్మ..మొట్లగూడెం

**కారేపల్లి,మహా:** పిల్లి గుడ్డిదైతే ఎలుక ఎకసక్కలాడినట్టు పర్యవేక్షించాల్సిన జిల్లా అధికారులు పట్టించుకోకపోవడంతో కారేపల్లి మండల ఐకేపీలో ఎక్కడా జరగని విధంగా పలువురు బరితెగించి భారీ అక్రమానికి పాల్పడ్డారు.గ్రామంలోనే లేని ఏడుగురు ముస్లింలతో పాటు మరో నలుగురి పేరుతో వినాయక పేరుతో ఓ గ్రూపును తయారుచేసి తద్వారా లక్షల రూపాయల బ్యాంకు లింకేజీ రుణాన్ని కాజేశారు.సంస్థలను కాపాడాల్సిన అధికారులే అడ్డగోలు పనులు చేసి ఇప్పుడు అడ్డంగా బుక్కయ్యారు.ఐకెపి అధికారులు అప్పటి బుక్ కీపర్ నజీర్, గ్రామదీపిక,సీసీ గౌసియా,అప్పటి ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్ భాస్కర్ కుమ్మక్కై ఫేక్ గ్రూపులతో బ్యాంకు సొమ్ము కాజేశారనే ఆరోపణలు ఉన్నాయి.ఈ ఘనులు ఉత్తుత్తి గ్రూపులతో భారీ అక్రమానికి తెరలేపారు.నిబంధనలకు విరుద్ధంగా ఆ గ్రామానికి ఏమాత్రం సంబంధం లేని,వేరే ప్రాంతాలకు చెందిన వ్యక్తులను ఆయా గ్రూపుల్లో సభ్యులుగా చేర్చి కారేపల్లి లోని గ్రామీణ వికాస్ బ్యాంకులో బ్యాంకు లింకేజీ రుణం కింద రూ. 12 లక్షలు కాజేశారు.

**వినాయక్ ఫేక్ గ్రూపు పేరుతో అక్రమం...**

కారేపల్లి మండలంలోని మోట్లగూడెం గ్రామంలో ముస్లిమ్స్ కుటుంబాలు లేనే లేవు.కేవలం ఒకటే కుటుంబం ఉన్నా సంబంధిత వ్యక్తులెవరు కూడా ప్రస్తుతం గ్రామంలో ఉండడం లేదు.ఇతర ప్రాంతాలకు చెందిన ఏడుగురు ముస్లిమ్స్ తో పాటు వేరే గ్రామాలకు చెందిన మరో ముగ్గురిని వినాయక పేరుతో ఉన్న ఈ ఫేక్ గ్రూపులో సభ్యులుగా చూపించారు.ఈ గ్రూపులో షేక్ షకీరా, షేక్ రజియా,షేక్ పర్వీన్,షేక్ జకియా, మహమ్మద్ షబానా,షేక్ షాహిన్, షేక్ ఫయాజ్,నల్లపాటి జయప్రద, నెల్లి రేణుక,నెల్లి పద్మ పేర్లతో ఫైల్ సబ్మిట్ చేసి 6 లక్షల రూపాయల రుణం కాజేశారు.

**స్వరాజ్ గ్రూప్ పేరుతోనూ అక్రమం...**

స్వరాజ్ గ్రూపులో మోట్ల గూడెం గ్రామానికి చెందిన ఇద్దరిని వయసు మీరి పోయిందనే కారణంతో తొలగించినట్లు చెబుతున్న వాళ్ల పేరిట రుణం ఇంకా కొనసాగుతూనే ఉంది. సంబంధిత సీసీ,బుక్ కీపర్ కు సంబంధించిన మరో ఫేక్ ముగ్గురిని సభ్యులుగా చేర్పించి ఇక్కడ కూడా మరో అక్రమానికి పాల్పడ్డారు.ఈ గ్రూపులో కూడా ముగ్గురు ముస్లింలను సభ్యులుగా చేర్చారు.షేక్ షమీనా, సయ్యద్ ముబీనా, షేక్ షమీన్ ఈ ముగ్గురి తో పాటు గ్రామానికి చెందిన మరో ఏడుగురు సభ్యులు ఈ గ్రూప్ లో సభ్యులుగా ఉన్నారు.కాగా క్షేత్రస్థాయి విచారణలో మరికొన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయి.గ్రూపులో వారి పేర్లు ఉన్నప్పటికీ వారికి ఏమాత్రం తెలవకుండా మరో 6 లక్షలు కాజేశారు. గ్రూపులో ఉన్న వారిని విచారిస్తే మేము తెచ్చిన అప్పులను కట్టేశామని, కొత్తగా తీసుకున్న అప్పుతో వారికి ఎటువంటి సంబంధం లేదని తెలిపారు.202223 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మోట్లగూడెం గ్రామానికి చెందిన స్వరాజ్, వినాయక్ గ్రూపుల్లో నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కి అప్పటి గ్రామ దీపిక, అప్పటి సీసీ వారికి సంబంధించిన బంధువులు, స్నేహితుల పేర్లను చేర్చి బ్యాంకు లింకేజీ కోసం కారేపల్లి లోని గ్రామీణ వికాస బ్యాంకులో రెండు గ్రూపుల్లో సుమారు 12 లక్షలు కాజేశారు.అధికారులు ఇచ్చిన ఫైల్ లో గ్రూపు సభ్యులందరి ఆధార్ కార్డులను ఐకెపి అధికారులు సమర్పించారు. వాటిని తప్పనిసరిగా వెరిఫై చేయాల్సిన బాధ్యత బ్యాంకు మేనేజర్ పై ఉంటుంది.ఐకెపి అధికారులతో కుమ్మక్కైన బ్యాంకు మేనేజర్ వివిధ ప్రాంతాలకు చెందిన ఆధార్ కార్డు దారులు వివిధ బ్యాంకుల అకౌంట్ల నెంబర్లు ఇచ్చినప్పటికీ వాటిని పరిశీలించకుండానే బ్యాంకు లింకేజీ రుణాలను మంజూరు చేయడం పట్ల సర్వత్ర అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.ఈ 12 లక్షలను పంచుకున్న వారు కొన్ని నెలలు అనుమానం రాకుండా వాయిదాలను కూడా కట్టారు. అనంతరం ఈ రెండు గ్రూపుల అప్పు రోజురోజుకి పెరిగిపోయి మొండి బకాయి జాబితాలో చేరింది.

# జర్నలిస్ట్ కప్ నిర్వహణ అభినందనీయం

- తాసిల్దార్ గోపాలకృష్ణ ఎఫ్ఆర్ఓ తేజస్వి
- ఉత్కంఠ భరితంగా కొనసాగుతున్న జర్నలిస్ట్ కప్-26 క్రికెట్ పోటీలు




**పినపాక, మహా:** పినపాక ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా ఎల్చి రెడ్డిపల్లి క్రికెట్ మైదానంలో జరుగుతున్న జర్నలిస్ట్ కప్ క్రికెట్ పోటీలు మూడో రోజు ఉత్కంఠ భరితంగా సాగాయి. మైదానంలో క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కనబరిచారు. మూడవ రోజు జరిగిన పోలీస్ వర్సెస్ బిటిపిఎస్ ఏఈ మ్యాచ్ లో ప్రతి బంతి ఉత్కంఠతను రేకెత్తించింది. ఇరుజట్ల మధ్య విజయం దోబూచులాడి చివరకు పోలీస్ జట్టును వరించింది. పోలీస్ జట్టు ఒక్క పరుగుతో విజయం సాధించింది. అనంతరం రెండో మ్యాచ్ లో ఫారెస్ట్ వర్సెస్ రెవిన్యూ జట్టు మధ్య జరిగిన మ్యాచ్ వారాహోరీగా సాగింది. ఈ మ్యాచ్లో ఫారెస్ట్ జట్టు విజయం సాధించింది. మూడో రోజు క్రికెట్ పోటీలకు గౌరవ అతిథులుగా పినపాక తాసిల్దార్ గొంది గోపాలకృష్ణ, ఎఫ్ఆర్ఓ తేజస్వి హాజరై మ్యాచ్లను తిలకించారు. క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధుల, జర్నలిస్టులతో కలిసి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఉద్యోగరీత్యా నిత్యం బిజీగా ఉండే తమకు ఇలాంటి క్రీడా పోటీల్లో పాల్గొనడం చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు తీసుకు వచ్చిందని అన్నారు. తమ స్నేహితులతో చదువుకున్న రోజుల్లో ఆడిన ఆటలు గుర్తుకు వచ్చాయని అన్నారు. ఇలాంటి క్రీడా పోటీలలో పాల్గొనడం వలన అధికారులు ఒకరికొకరు పరిచయాలు పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమేష్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కీసర్ సుధాకర్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు బూరా శంకర్, బిల్లా నాగేందర్, ముక్కు మహేష్‌రెడ్డి, కొంపెల్లి సంతోష్, దిలీప్ వివిధ శాఖల ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.



**మారుమూల గ్రామాల అభివృద్ధిలో శివ నాగ స్వామి సేవలు**

# అమోఘమైనవి..

**సీఐ వెంకటప్పయ్య**

**మహా, దుమ్ముగూడెం:** ఏజెన్సీలోని మారుమూల గ్రామాల అభివృద్ధి కొరకు చిన్న అరుణాచలం వ్యవస్థాపకులు శివ నాగ స్వామి చేస్తున్న సేవలు అమోఘమైనవని దుమ్ముగూడెం సీఐ టి.వెంకటప్పయ్య అన్నారు. మండల పరిధిలోని చతిస్గడ్ మారుమూల ప్రాంతమైన మానుగట్ట లో కరెంటు సదుపాయం లేని 40 కుటుంబాలకు నరసాపురం శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ మహాక్షేత్రం తరపున శివ నాగ స్వామి ఆధ్వర్యంలో 40 సోలార్ లైట్లు, చాపలు సీఐ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. ఏజెన్సీ లోని ఆదివాసులు అభివృద్ధి విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కొరకు ఆలయ వ్యవస్థాపకులు శివ నాగ స్వామి మంచి కార్యక్రమాలు చేపడుతున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కనుబుద్ధి దేవా, అరుణ సేవ గణాలు బాలకృష్ణ, చిరంజీవి, మాధవి, మహేష్, మమత, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఎస్సీ ఎస్టీ సంక్షేమ సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



**సత్తుపల్లి, మహా:** సింగరేణి సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో సంస్థ ఎస్సీ ఎస్టీ సంక్షేమ సంఘం 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను జి.ఎం చింతల శ్రీనివాస్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీమ్ రావు అంబేద్కర్ చిత్రపటంతో సింగరేణి సంస్థ క్యాలెండర్ ఆవిష్కరించడం శుభ పరిణామం అన్నారు. దీనికి సహకరించిన సంస్థ ఉద్యోగులను జి.ఎం అభినందించారు. క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ జనరల్ సెక్రెటరీ అంతోటి నాగేశ్వరరావు, కిష్టారం ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ సునీల్ వర్మ, ఎస్ఓటు జి.ఎం బెల్లం శ్రీనివాస్, ఎస్.ఓ.ఎం బెజ్జంకి రాజేశ్వరరావు, కళ్యాణ్ రామ్, సేఫ్టీ ఆఫీసా గోవింద్, నిర్మాణ విభాగం ఇంజనీర్ రవికుమార్, సెంట్రల్ కమిటీ మెంబర్ జిమ్మిడి మల్లేష్, బందెల విజయేందర్, చెరుకుపల్లి నాగరాజు, మనీష్ విక్టర్, మొగిలిపాక రవి తదితరులు పాల్గొన్నారు.




**విద్యార్థులు భాషా నైపుణ్యాలను కలిగి ఉండాలి**

**ఎంఈఓ సున్నం సమ్మయ్య**

**మహా, దుమ్ముగూడెం:** విద్యార్థులు సృజనాత్మక భాషా నైపుణ్యాలను కలిగి ఉండాలని దుమ్ముగూడెం విద్యాశాఖ అధికారి సున్నం సమ్మయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చిన్ననబల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో పర్ణశాల జిల్లా పరిషత్ కాంప్లెక్స్ పరిధిలోని 27 పాఠశాలలోని విద్యార్థులు ఉపాధ్యాయులకు బాలమేళా 2 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ మాట్లాడుతూ.. బాలమేళా కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక ఏర్పడుతుందని వారు తయారు చేసిన ఆవిష్కరణలో ఎంతగానో ఆకట్టుకున్నాయని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థి దశ నుండి కొత్త పద్ధతిలో నేర్పించాలని కోరారు. తెలుగు గణితం భాషల నైపుణ్యాలను పరిశీలించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏ జె ప్రభాకర్, వేముల శీను, లక్ష్మీనారాయణ, సిఆర్పి జయరావు తదితరులు పాల్గొన్నారు.



**ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాయం..**

**ముస్లిం సోదరులతో కలిసి ఐక్యత చాటిన ప్రజాప్రతినిధి ...**

**మణుగూరు, మహా :** మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని కూరగాయల మార్కెట్ మసీదులో శుక్రవారం నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముస్లిం సోదరులతో కలిసి ఉపవాస విరమణ చేసి శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగ శాంతి, సౌభ్రాతృత్వం, సహనానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. అన్ని మతాల ప్రజలు ఐక్యంగా జీవించడం భారతీయ సంస్కృతి ప్రత్యేకత అని తెలిపారు. మత సామరస్యాన్ని కాపాడుతూ పరస్పర గౌరవంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల మధ్య ఐక్యతే సమాజ బలమని, అభివృద్ధికి అదే పునాది అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ అధ్యక్షులు రహీం పాషా, మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, సమితి సింగారం ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, సీనియర్ నాయకులు పోలమూరి రాజు, సామ శ్రీనివాస్ రెడ్డి, ఐతనబోయిన సతీష్, కూనవరం పంచాయతీ వార్డు సభ్యులు బర్ల శ్వేతన్, సమితి సింగారం వార్డు సభ్యులు కోలపిన్ని మానస, మహిళా అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# సైన్స్ తోనే సమాజ ప్రగతి

- విశ్వశాంతి లో ముగిసిన సైన్స్ వారోత్సవాలు
- ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మట్టా రాగమయి



**సత్తుపల్లి, మహా:** సైన్స్ తోనే సమాజ ప్రగతి ఆధారపడి ఉందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం( ఫిబ్రవరి 28) పురస్కరించుకొని విశ్వశాంతి విద్యాలయంలో నిర్వహించిన సైన్స్ వారోత్సవాలు శుక్రవారం ముగియడంతో,ముగింపు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు రూపొందించిన సుమారు 200 రకాల అంశాలను సైన్స్ ఎక్స్పోలో ప్రదర్శించారు. ఎగ్జిబిషన్ ప్రారంభించిన అనంతరం విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రయోగాలు నేర్చుకోవడం వలన విద్యార్థులలో అవగాహన శక్తి, తెలుసుకోవాలనే కోరిక, సైన్స్ పట్ల ఆసక్తి, ప్రాజెక్టు చేయగలననే ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. విద్యార్థులు చిన్నతనంలోనే ఒక లక్ష్యం ఏర్పరచుకొని దాని సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సత్తుపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా బేగం కమల్ పాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ బొంతు సుమలత మాట్లాడుతూ మానవ మనుగడ సైన్స్ తోనే ముడిపడి ఉందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికి సైన్స్ పట్ల అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కమల్ పాష, వార్డ్ కౌన్సిలర్ అపర్ణ తదితరులు విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం సత్యనారాయణ, అవినాష్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు

- భోగ్ బండారో లో పాల్గొన్న వైరా ఎమ్మెల్యే
- బంజారా ఆటపాటలతో అలరించిన మహిళలు




**జూలూరుపాడు, మహా:** మండల పరిధి పడమట నర్సాపురం లోని శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో సేవాలాల్ 287వ జయంతి వేడుకలను అధికారికంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ జయంతి వేడుకలలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జయంతి వేడుకలకు విచ్చేసిన ఎమ్మెల్యేకి ఆలయ కమిటీ, సంత్ సాధువులు సాంప్రదాయ స్వాగతం పలికారు. అనంతరం బంజారాల పవిత్ర సాంప్రదాయ భోగ్ బండారో ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని సంత్ సాధువుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. సాంప్రదాయ బంజారా నృత్యంలో మహిళలతో కలిసి ఆటపాటలతో చూపరులను అలరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బంజారా జాతి అభివృద్ధికి శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ చేసిన సేవలను కొనియాడారు. అహింసా, మూఢనమ్మకాలు, మద్యపానం, సంఘ సేవ, నిరంకుశ పాలనపై తిరుగుబాటు లాంటి మహత్తర ఆయన ఆశయ సాధన మనందరికీ మార్గదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంఘం లక్ష్మీ కుమారి, కాంగ్రెస్ నాయకులు లేళ్ళ వెంకటరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మంగీలాల్ నాయక్, లచ్చు నాయక్, మహిళా అధ్యక్షురాలు ప్రియాంక, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు అల్లడి నరసింహారావు, నవీన్ రాథోడ్, మధుసూదనరావు, పొన్నెకంటి సతీష్‌కుమార్, లేళ్ళ అప్పిరెడ్డి, కాజా రమేష్, లేళ్ళ గోపాలరెడ్డి, రామిరెడ్డి, నాగ శ్రీనివాసరావు, ఆర్కె నాయుడు, ఆలయ కమిటీ చైర్మన్ బాదావత్ వెంకట్ రామ్, మాన్ సింగ్, రాంకోటి, అధికారులు ఎంపీడీఓ అజయ్, ఏఓ దీపక్ ఆనంద్, ఆర్ఐ ఆదినారాయణ, సీఐ శ్రీలక్ష్మి, ఎస్సై రవి, కార్యదర్శి బి హారిక తోపాటు, పార్టీ శ్రేణులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




**మణుగూరులో గుర్తింపు కార్మిక సంఘం సమావేశం**

**కార్మికుల సమస్యలపై యాజమాన్యానికి ఏఐటీయూసీ వినతి..**

**మణుగూరు, మహా :** ఏఐటియుసికి అనుబంధ సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఆధ్వర్యంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ మణుగూరు జీఎం కార్యాలయంలో శుక్రవారం స్ట్రక్చర్ సమావేశం నిర్వహించారు. ఏరియా జీఎం దుర్గం రామచందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సంఘం ప్రతినిధులు ప్రస్తావించారు. మణుగూరు ఓసీ4 గనిలో తీవ్ర దుమ్ము, ధూళి సమస్య ఉందని పేర్కొన్నారు. అలాగే గని కాంటీన్ కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు.ప్రస్తుతం మణుగూరు సింగరేణి కాంటీన్‌లో టీ తయారీకి వాడుతున్న పాలపొడి బదులుగా స్వచ్ఛమైన పాలను వినియోగించాలని కోరారు. కెపియూజి భూగర్భ గనిలో సూపర్వైజర్లు, కార్యాలయ సిబ్బందికి మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, కార్మికుల కోసం విశ్రాంతి షెల్టర్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. మణుగూరు ప్రాంతంలో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ల సరఫరా సక్రమంగా జరగక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. కెపియూజి గనిలో పని స్థలాలు మెరుగుపరచడం, వెంటిలేషన్ సమస్యను పరిష్కరించడం అవసరమని సూచించారు. ఎస్ అండ్ పి సిబ్బందికి యూనిఫాంలు అందజేయాలని, ఏరియాలోని భద్రాద్రి స్టేడియం మైదానంలో లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని మజ్జిగ ప్యాకెట్లు, చల్లటి తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వైద్య సదుపాయాలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఓపెన్ కాస్ట్ క్వారీ ప్రాంతాలు, కేసీహెచ్‌పి విభాగాల్లో దుమ్ము, ధూళి కారణంగా కార్మికులు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. గుర్తింపు కార్మిక సంఘం ప్రస్తావించిన సమస్యలపై యాజమాన్యం సానుకూలంగా స్పందించిందని బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్ తెలిపారు. కార్మికుల రక్షణ, హక్కుల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ ఎల్లప్పుడూ చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీజీఎం పర్సనల్ సలగల రమేష్, జీఎం కమిటీ సభ్యులు మేకల ఈశ్వరరావు, ఆవుల నాగరాజు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాలపై ఎమ్మెల్యే పాయం సమీక్ష..

**మౌలిక వసతుల లోపాలు నివారిస్తాం.. నిధులు మంజూరు చేయిస్తాం.. సమీక్షలో ఎమ్మెల్యే పాయం హామీ..**




**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై శుక్రవారం ప్రజా భవన్‌లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, సేవల నాణ్యత, మౌలిక వసతుల స్థితిగతులపై సమగ్రంగా చర్చించారు. పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార మెనూ సక్రమంగా అందుతున్నదా లేదా అన్న అంశాన్ని ప్రత్యేకంగా పరిశీలించారు.పక్కా భవనాలు, ప్రహరీ గోడలు, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి సదుపాయాలపై అధికారులతో సమీక్షించారు. కొన్ని కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు లేని విషయం వెల్లడవగా, మరికొన్ని కేంద్రాల్లో అన్ని సదుపాయాలు ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న మౌలిక వసతుల లోపాలను ప్రభుత్వం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన నిధులు మంజూరు చేయించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను అడిగి తెలుసుకుని, లిఖితపూర్వకంగా దరఖాస్తులు అందజేస్తే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ పథకాలకు అర్హులైన టీచర్లకు ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాలను అందించే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సూచనలు:అంగన్‌వాడీ సిబ్బంది మరింత బాధ్యతతో పని చేయాలి. విధుల్లో నిర్లక్ష్యం వహించకూడదు.రోజువారీ నిర్వహణ సక్రమంగా ఉండాలి. నిధులను సద్వినియోగం చేసుకోవాలి.పిల్లలకు మెరుగైన సేవలు అందించేందుకు సమన్వయంతో పని చేయాలి. ఈ సమీక్షా సమావేశంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశం ద్వారా మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మెరుగుపర్చే దిశగా ఎమ్మెల్యే పాయం స్పష్టమైన మార్గదర్శకాలు సూచించారు.



**కేజ్రీవాల్‌పై కేసులు**

# బీజేపీ కుట్ర

**నేలకొండపల్లి, మహా:** ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ పై తప్పుడు కేసులు బీజేపీ కుట్రేనని ఆన్‌ఆద్మీపార్టీ పాలేరు ఇంచార్జీ పసుమర్తి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు... ఢిల్లీ లిక్కర్ స్కామ్లో కేజ్రీవాల్ న్యాయస్థానం క్లీన్చిట్ ఇచ్చిందని అన్నారు. నీతి, నిజాయితీగా ఉన్న వారిని దెబ్బతీయాలని బీజేపీ అనేక కుట్రలు పన్నారని అన్నారు. కానీ ప్రజాస్వామ్యంలో న్యాయం గెలిచిందని పేర్కొన్నారు. న్యాయస్థానం తీర్పుతో బీజేపీ కి చెంప పెట్టు అన్నారు. బీజేపీ ని త్వరలోనే ఆఫ్ పార్టీ ఉడేస్తుందని అన్నారు. త్వరలో జరగనున్న 5 రాష్ట్రాలలో 'బీజేపీ కి తగిన బుద్ధి చెబుతారని అన్నారు. రాజ్యంగ వ్యవస్థలను వాడుకుని ప్రజల నిధులు దుర్వినియోగం చేస్తూ ప్రజాస్వామ్యంను భూనీ చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా బీజేపీ తీరు మారాలని... ప్రజా సమస్యల పరిష్కారం పై దృష్టి సారించాలని సూచించారు.




**ఢిల్లీ సత్యగ్రహ దీక్షలో అంజిని**

**నేలకొండపల్లి, మహా:** ఢిల్లీ లో జరిగిన సత్యగ్రహదీక్షలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి జెర్రిపోతుల అంజిని పాల్గొన్నారు. ఏఐ సమ్మిట్ సందర్భంగా యువజన కాంగ్రెస్ ను దేశ వ్యాప్తంగా దోషిగా చిత్రకరించే ప్రయత్నంలో అక్రమ అరెస్టు చేయటాన్ని నిరసిస్తూ ఢిల్లీ లో చేపట్టిన సత్యగ్రహ దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అంజిని మాట్లాడారు...జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాను చీబ్ ను అక్రమంగా అరెస్ట్ చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. ఢిల్లీ లో గత నాలుగు రోజులుగా దీక్ష లు చేపట్టినట్లు తెలిపారు. దశల వారీగా రాష్ట్రంలో కూడ ఆందోళన లు చేపడతామని పేర్కొన్నారు.

## రైతు భరోసాను వెంటనే విడుదల చేయాలి

**బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు దొడ్డి తాతరావు**



**చర్ల మహా:** ఈ రోజు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల BRS పార్టీ కార్యాలయం నందు పత్రిక విలేకరుల తో మాట్లాడుతూ... రైతు భరోసాను వెంటనే విడుదల చేయాలని చర్ల మండల BRS పార్టీ అధ్యక్షులు దొడ్డి తాతరావు డిమాండ్ చేశారు. యాసంగి వరి నాట్లు పూర్తి అయి రోజులు గడుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాను విడుదల చేయడంలో జాప్యం చేయడం తగదని అన్నారు...మున్సిపల్ ఎన్నికలు అనంతరం రైతుబంధు ఇస్తామని హడావిడిగా ప్రకటించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటివరకు మాట నిలబెట్టుకోలేదన్నారు...మొదట డిసెంబర్ ఆపై సంక్రాంతి ఇప్పుడు మార్చి అంటూ రైతుబంధును వాయిదా వేస్తూ ప్రభుత్వం డ్రామాలు ఆడుతుందని విమర్శించారు....రైతు బంధు చెల్లించకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయరని పేర్కొన్నారు...పంచాయతీ ఎన్నికల్లో రైతుల ఓట్ల కోసం ఒకసారి మాత్రమే రైతుబంధు ఇచ్చి ఆ తర్వాత సహకార ఎన్నికలను కూడా రద్దు చేయడం వెనక రైతుబంధు ఇవ్వాలనే ఉద్దేశం లేదనే ఆరోపించారు..రైతుబంధును కేవలం ఎన్నికల ఎరగా వాడుతున్నారని రైతులు తెలంగాణ ప్రజానీకం భావిస్తున్నారని అన్నారు...ఇప్పటికైనా రైతు భరోసా నిధులు విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు. రైతుల పక్షపాతి అని చెప్పుకునే ప్రభుత్వం రైతులకు చేసిందేమీ లేదని 2 లక్షల రుణమాఫీ సైతం పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని ఆయన పేర్కొన్నారు.

## స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ షబ్బీర్**



**కారేపల్లి, మహా:** మైనారిటీ యువతి యువకులు స్వయం ఉపాధి పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి,వైరా శాసనసభ్యులు రాందాస్ నాయక్ ప్రధాన అనుచరుడు షేక్ షబ్బీర్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని మైనారిటీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రెండు ప్రత్యేక పథకాలను ప్రవేశపెడుతున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఎండి ముజుహిద్ ఓ ప్రకటనలో తెలిపారని అర్హులైన మైనారిటీ సోదరులు ఈ యొక్క అవకాశాన్ని మార్చి 1వ తేదీ లోపు దరఖాస్తు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అర్హులైన వారికి ఎలక్ట్రిక్ స్కూటర్లు తురక కాశ ముస్లింలకు టూల్ కిట్లు జనరేటర్ల కోసం ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

## విద్యా హక్కు చట్టానికి
# కమిషన్ తూట్లు

- విద్యా కమిషన్ నివేదికపై మండిపడ్డ ఉపాధ్యాయలోకం..
- ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే కుట్ర టీఆర్‌టీఎఫ్..
- మూడు గ్రామాలకు ఒక బడితో పేదలకు చదువు దూరం..
- పదోన్నతులపై గొడ్డలి పెట్టు వేతనాలపై అసంబద్ధ వ్యాఖ్యలు..
- ఆకునూరి మురళి కమిటీ సిఫార్సులపై టీఆర్‌టీఎఫ్ నల్లగొండ జిల్లా శాఖ నిప్పులు



**నల్లగొండ టౌన్ మహా :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'తెలంగాణ విద్యా విధానం 2026' ముసాయిదా నివేదికపై ఉపాధ్యాయ లోకం భగ్గుమంటోంది. ఆకునూరి మురళి నేతృత్వంలోని విద్యా కమిషన్ సమర్పించిన ఈ నివేదిక ప్రభుత్వ విద్యా వ్యవస్థ పునాదులను దెబ్బతీసేలా ఉందని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (TRTF) తీవ్రంగా ఆక్షేపించింది. శుక్రవారం నల్లగొండలో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నిమ్మనగోటి జనార్ధన్, తరాల పరమేశ్ యాదవ్ మాట్లాడుతూ కమిషన్ సిఫార్సులపై నిప్పులు చెరిగారు.కేంద్రం తెచ్చిన విద్యాహక్కు చట్టం (RTE2009) ప్రకారం ప్రతి కిలోమీటర్ పరిధిలో ప్రాథమిక పాఠశాల ఉండాలని, కానీ కమిషన్ ప్రతిపాదించిన 'మూడు గ్రామాలకు ఒక పాఠశాల' విధానం గ్రామీణ పేద విద్యార్థులను చదువుకు దూరం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని ధ్వజమెత్తారు.

**కమిషన్ నివేదికలో అసంబద్ధ అంశాలు..**

ఉపాధ్యాయుల వేతనాలు మార్కెట్ రేట్ల కంటే ఎక్కువగా ఉన్నాయనడం వారి శ్రమను అవమానించడమే. ఇది వేతన సవరణ కమిటీ కాదన్న కనీస స్పృహ కమిషన్‌కు లేకపోవడం దారుణం. హైస్కూల్ హెడ్ మాస్టర్ పోస్టుల్లో 50 శాతం నేరుగా నియామకాలు చేపట్టాలన్న ప్రతిపాదన ఏళ్ల తరబడి పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ల ఆశలపై నీళ్లు చల్లడమే.ఎంఈఓ నియామకాలు, పదోన్నతుల్లో సీనియారిటీని పక్కనపెట్టి రాత పరీక్షలు, ఇంటర్వ్యూలు పెట్టడం వల్ల రాజకీయ జోక్యం, అవినీతి పెరిగే ప్రమాదం ఉంది.ఉపాధ్యాయులకు భరోసా నిచ్చే 6/12/18/24 ఏళ్ల స్కేళ్లను (AAS) బడ్జెట్ భారంగా చూడటం విచారకరం. విద్యా బడ్జెట్ 10 శాతం నుంచి 5.9 శాతానికి పడిపోయినా నిధుల సేకరణపై కమిషన్ మాట్లాడకపోవడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనం.

**ప్రయోగశాలలుగా ప్రభుత్వ బడులా?**

గతంలో సక్సెస్, మోడల్, గురుకులాల పేరుతో ప్రయోగాలు చేసి వ్యవస్థను గందరగోళపరిచారని ఇప్పుడు 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్' పేరుతో ఉన్న పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఉపాధ్యాయులు 15 కి.మీ పరిధిలోనే ఉండాలన్న నిబంధనలు వారిని మానసిక ఒత్తిడికి గురిచేస్తాయని మౌలిక వసతులు కల్పించకుండా నిబంధనలు రుద్దడం వల్ల ఫలితం ఉండదని స్పష్టం చేశారు. ఉపాధ్యాయ వ్యతిరేక విద్యా కమిషన్ నివేదికను ప్రభుత్వం తక్షణమే పక్కన పెట్టాలని ప్రైవేట్ రంగ నియంత్రణతో పాటు ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై దృష్టి సారించాలని టీఆర్‌టీఎఫ్ నేతలు డిమాండ్ చేశారు.

## హుజూర్ నగర్ ఆర్డిఓ కార్యాలయంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ క్లినిక్ ను ప్రారంభించిన జిల్లా ప్రిన్సిపల్ జడ్జ్ పి లక్ష్మీ శారద




**హుజూర్ నగర్ మహా:**సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ రాజస్వమండలాధికారి (ఆర్ డి ఓ) కార్యాలయంనందు శుక్రవారం జిల్లా ప్రిన్సిపల్ జడ్జ్ పి లక్ష్మీ శారద చేతుల మీదగా లీగల్ ఎయిడ్ కౌన్సిల్ క్లినిక్ ను ప్రారంభించడం జరిగింది ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలోని సీనియర్ సిటిజన్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు న్యాయ సహాయం పొందలేని వారికి ఉచిత న్యాయ సలహాలు, సూచనలు సహాయం కోసం ఏర్పాటు చేయబడినవి లీగల్ ఎయిర్ కౌన్సిల్ క్లినిక్స్ అన్నారు ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది అడ్వకేట్స్ ఆర్ డి ఓ కార్యాలయ డి ఏ ఓ సురేందర్ రెడ్డి సురేందర్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## అట్లూరి మంజుల-హరిబాబు లను సన్మానించిన పల్లపు నరసింహరావు, సావిత్రి, పల్లపువెంకటేశ్వర్లు, క్రాంతికుమార్



**హుజూర్ నగర్ మహా:** హుజూర్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డు మొట్టమొదటి మహిళా కౌన్సిలర్ అట్లూరి మంజులహరిబాబు లను 23వ వార్డు ప్రజలు పల్లపు నరసింహరావుసావిత్రి, పల్లపు వెంకటేశ్వర్లు, నాగేళ్ల క్రాంతి కుమార్ లు మర్యాదపూర్వకంగా కలిసి వార్డ్ కౌన్సిలర్ గెలుపొందిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు.

## రామస్వామి గుట్ట వద్ద ఇందిరమ్మ ఇండ్ల పెండింగ్ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**హుజూర్ నగర్ మహా:** సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ పట్టణంలోని రామస్వామి గట్టు వద్ద ఇందిరమ్మ ఇండ్ల పెండింగ్ పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పరిశీలించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని,అవసరమైతే ఎక్కువ మంది లేబర్ ను తీసుకొని పనులు పూర్తి చేసి మార్చి మొదటి వారంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించడానికి సిద్ధం చేయాలని అన్నారు.బ్లాక్ లో మధ్య గల అంతర్గత రోడ్లు,డ్రైనేజీ వ్యవస్థ,విద్యుత్ సరఫరా, మొక్కలు నాటడం, పెయింటింగ్ పనులు,స్ట్రీట్ లైట్స్ మొదలైన అన్ని రకముల పెండింగ్ పనులు పూర్తిచేయాలని ఎలాంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, గుత్తేదారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ పిడి సిద్ధార్థ, మిషన్ భగీరథ ఇ.ఇ. కరుణాకర్ రెడ్డి, తహశీల్దార్ కవిత ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పేదల ఇళ్లను కూల్చడం దుర్మార్గమైన చర్య




- పేదల ఇళ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి మారకపోతే రాష్ట్ర ప్రభుత్వ పీటలు ప్రజలు కదిలించడం ఖాయం
- కూల్చిన పేదల ఇండ్లకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి
- నిరాశరైన పేదలను ఆదుకోవాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

**సూర్యాపేట జిల్లా మహా** పేదలకు ఇల్లు కట్టిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఆధీనంలో ఉన్న ఇండ్లను కుల్చడం దుర్మార్గమైన చర్య అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆరోపించారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో జరిగిన సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలోని వెలుగుమట్లలో గత పది సంవత్సరాలుగా భూదాన్ భూముల్లో ఇండ్లు నిర్మించుకొని జీవిస్తున్న పేదలపై రెవిన్యూ యంత్రాంగం, పోలీసు బలగాలు దాడి చేసి పేదల ఇండ్లను కూల్చడం దుర్మార్గమైన చర్య అన్నారు. పేదల ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వ వైఖరి మారకపోతే రాష్ట్ర ప్రభుత్వ పీటలు ప్రజలు కదిలించడం ఖాయమన్నారు.కూల్చిన ఇండ్ల స్థానంలో పేదలకు ఇండ్లుకు పట్టాలు ఇచ్చి, ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసుల, రెవిన్యూ అధికారుల దాడి మూలంగా సర్వం కోల్పోయిన నిరాశరాయులు అయినా వారికి ప్రభుత్వం నష్టపరిహారంచెల్లించాలన్నారు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి యాప్ ద్వారా కాకుండా సొసైటీల ద్వారా యూరియా పంపిణీ చేయాలన్నారు. రైతాంగానికి వెంటనే రైతు భరోసా డబ్బులను రైతుల ఖాతాలో వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వేసవికాలం ప్రారంభమైన సందర్భంగా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టి త్రాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధానంగా దళిత, గిరిజన తండాలలో తాగునీటి సమస్య తీవ్రమయ్యే పరిస్థితులు ఉన్నాయన్నారు.గ్రామీణ,పట్టణ కేంద్రాలలో ప్రజలు ఎదురుకుంటున్న సమస్యలైన స్థానిక సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలుకు సిద్ధం కావాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగారపు పాండు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి, సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కోలిశెట్టి యాదగిరిరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు, మట్టిపెల్లి సైదులు, కోట గోపి పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వేల్పుల వెంకన్న, ధనియాల శ్రీకాంత్, జె.నరసింహారావు, కందాల శంకర్ రెడ్డి, బుర్ర శ్రీనివాస్, పల్లె వెంకట్ రెడ్డి,దుగ్గి బ్రహ్మ,దండ వెంకటరెడ్డి, షేక్ సైదా, కొప్పుల రజిత, జూలకంటి విజయలక్ష్మి, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, పులుసు సత్యం,బెల్లంకొండ సత్యనారాయణ,వట్టపు సైదులు, మిట్ట గనుపుల ముత్యాలు పాల్గొన్నారు.

# దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL

# ప్రైవేట్ పెట్టుబడులు వెల్లువెత్తాలి

**నవీన ఆవిష్కరణలకు నడుం బిగించాలి.. పారిశ్రామిక వర్గాలకు ప్రధాని నరేంద్ర మోదీ సూచన**



**న్యూఢిల్లీ:** దేశంలో మరిన్ని పెట్టుబడులు, నవీన ఆవిష్కరణలకు భారత పారిశ్రామిక వర్గాలు తక్షణమే నడుం బిగించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధిలో ప్రైవేట్ రంగం సైతం కీలక పాత్ర పోషించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వరుస బడ్జెట్ ల ద్వారా పెట్టుబ డులకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సైతం పెట్టుబడి వ్యయాన్ని భారీగా పెంచుతోందని గుర్తుచేశారు. శుక్రవారం 'టెక్నాలజీ, రిఫామ్స్, ఫైనాన్స్ ఫర్ వికసిత్ భారత్'పై మొదటి పోస్ట్-బడ్జెట్ వెబినార్‌లో ప్రధాని మోదీ ప్రసంగించారు. 11 ఏళ్ల క్రితం ప్రభుత్వ పెట్టుబడి వ్యయం రూ.2 లక్షల కోట్లుగా ఉండేదని, ఇప్పుడు అది రూ.12 లక్షల కోట్లకు చేరిందని వెల్లడించారు. రెట్టించిన ఉత్సాహంతో ప్రైవేట్ పెట్టుబడులు వెల్లువెత్తేలా 2026-27 బడ్జెట్‌లో పలు ప్రకటనలు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం, పారిశ్రామిక వర్గాలు, నైపుణ్యాలు కలిగిన భాగస్వాములు కలిసి కట్టుగా పనిచేస్తే సంస్కరణలు అద్భుతమైన ఫలితాలు ఇస్తాయన్నారు. కాగితంపై ప్రకటించినవి క్షేత్రస్థాయిలో విజయాలుగా నమోదు అవుతాయన్నారు. పెట్టుబడుల విషయంలో ప్రభుత్వ ప్రాధాన్య రంగాల గురించి ప్రధానమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. రహదారులు, రైల్వేలు, ఓడ రేవులు, విమానా శ్రయాలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఇంధన వ్యవస్థల్లో ప్రభుత్వం రికార్డు స్థాయిలో పెట్టుబడి వ్యయం చేస్తున్నట్లు తెలియజేశారు. ఆయా రంగాల్లో ప్రైవేట్ పెట్టుబడులకు చక్కటి అవకాశాలు ఉన్నాయన్నారు. '2047 నాటికి వికసిత్ భారత్' ఆశయాన్ని సాకారం చేసుకోవడానికి 'సంస్కరణల భాగస్వామ్య చార్టర్' రూపొందించుకుందామని మోదీ ప్రతిపాదించారు.

# ప్రచండ్‌లో రాష్ట్రపతి

**యుద్ధ హెలికాప్టర్‌లో ప్రయాణించిన తొలి రాష్ట్రపతిగా రికార్డు**



**జైపూర్:** తేలికపాటి యుద్ధ హెలికాప్టర్ 'ప్రచండ్'కు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కో-పైలట్‌గా వ్యవహరించారు. ఆలివ్ గ్రీన్ ఫ్లయింగ్ సూట్, హెల్మెట్ ధరించి, హెలికాప్టర్‌లో 25 నిమిషాల పాటు ప్రయాణించారు. రాజస్తాన్ రాష్ట్రం జైసల్మేర్ జిల్లాలో భారత్-పాకిస్తాన్ సరిహద్దు సమీపంలో శుక్రవారం ఈ దృశ్యం ఆవిష్కృతమైంది. రాష్ట్రపతి జైసల్మేర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌ను సందర్శించారు. అక్కడి నుంచి భారత వైమానిక దళానికి(ఐఏఎఫ్) చెందిన ప్రచండ్ హెలికాప్టర్‌లో బయలుదేరారు. కాక్‌పిట్‌లో కూర్చున్న తర్వాత ఐఏఎఫ్ సిబ్బందికి, అధికారులకు అభివాదం చేశారు. త్రివిధ దళాల సుప్రీంకోర్టు కమాండర్ హోదాలో కాక్‌పిట్ నుంచి ఒక సందేశం విడుదల చేశారు. భారతదేశ స్వయం స్వావలంబనకు ప్రచండ్ హెలికాప్టర్ ఒక ప్రతీక అని పేర్కొన్నారు. జైసల్మేర్ జిల్లా భూభాగంపై ప్రయాణానికి శ్రీకారం చుడుతున్నానని వెల్లడించారు. మన వీర సైనికులకు అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని స్పష్టంచేశారు. 'జై హింద్, జై భారత్'అంటూ ఉద్ఘాటించారు. పోఖ్రాన్ ఫైరింగ్ రేంజ్ మీదుగా ప్రచండ్ ప్రయాణించింది. అంతకుముందు ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ వద్ద రాష్ట్రపతి ముర్ముకు ఐఏఎఫ్ చీఫ్ ఎయిర్ మార్షల్ ఎ.పి.సింగ్ స్వాగతం పలికారు. యుద్ధ హెలికాప్టర్‌లో ప్రయాణించిన మొట్టమొదటి రాష్ట్రపతిగా ద్రౌపదీ ముర్ము రికార్డుకెక్కారు. ఆమె గతంలో రఫేల్, సుఖోయ్ లాంటి యుద్ధ విమానాల్లో విహరించారు.

## డీఎంకేలో చేరిన
# పన్నీర్ సెల్వం

మాతృ సంస్థలో చేరడం సంతోషంగా ఉందన్న నేత
సీఎం స్టాలిన్‌పై ప్రశంసల జల్లు



**చెన్నై:** అసెంబ్లీ ఎన్నికలకు ముందు తమిళనాడు రాజకీయాల్లో సంచలనాత్మకమైన మార్పులు జరుగుతున్నాయి. మాజీ ముఖ్యమంత్రి, ఏఐఏడీఎంకే బహి ష్కృత నేత ఓ.పన్నీర్ సెల్వం (ఓపీఎస్) డీఎంకేలో చేరారు. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ సమక్షంలో ఆయన డీఎంకే కండువాను కప్పుకొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. డీఎంకేలో చేరడం తన సొంత ఇంటికి వచ్చినట్లుగా ఉందన్నారు. సీఎం స్టాలిన్ అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని, అన్నాదురై, కరుణానిధి చూపిన దారిలో ప్రతి ఒక్కరినీ కలుపుకొనిపోతూ పార్టీని, ప్రభుత్వాన్ని ఆదర్శంగా నడిపిస్తున్నారని కొనియాడారు. 'దేశం మొత్తం స్టాలిన్ నాయకత్వాన్ని నిశితంగా గమనిస్తోంది. రాజకీయ పార్టీని ఎలా నడపాలో ఆయన కొత్త వ్యాకరణం నిర్దేశించారు. తమిళనాడు ప్రజలకు సమర్థవంతమైన, గొప్ప ప్రశంసనీయమైన పరిపాలనను అందిస్తున్నారు'అని కొనియాడారు.



# సత్తా చాటిన 'వాయుశక్తి'

విశేషంగా ఆకట్టుకున్న వైమానిక దళం విన్యాసాలు
హాజరైన రాష్ట్రపతి ముర్ము, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

**జైసల్మేర్:** భారత వైమానిక దళం(ఐఏఎఫ్) తన శక్తిసామర్థ్యాలు, పోరాట పటిమను మరోసారి ప్రదర్శించింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో చేపట్టిన మిషన్లను మళ్లీ కళ్లకు కట్టింది. 'వాయుశక్తి'విన్యాసాల్లో భాగంగా శుక్రవారం రాజస్తాన్‌లోని పోఖ్రాన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో ఐఏఎఫ్ విన్యాసాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఒళ్లుగగుర్పొడిచే యుద్ధ విమానాల ప్రదర్శనలను స్వయంగా వీక్షించారు. థార్ ఎడారిలో భారత్-పాకిస్తాన్ సరిహద్దులోనే ఉదయం నుంచి రాత్రి దాకా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్‌పై ప్రత్యేక ప్రదర్శన జరిగింది. శత్రువుల రన్‌వే, ఇంధన నిల్వ కేంద్రాలు, బంకర్లు, రాడార్ కేంద్రాలు, యుద్ధ ట్యాంకులు, సాయుధ కాన్వాయ్‌లు, కమ్యూనికేషన్ సెంటర్లు, ఉగ్రవాదుల శిబిరాలు, హ్యాంగర్లు, కమాండ్ కంట్రోల్ సెంటర్లను వైమానిక దాడుల్లో ఎలా ధ్వంసం చేస్తారన్నది ఐఏఎఫ్ జవాన్లు ప్రత్యక్షంగా చూపించారు.

## రాంచీలో
## గజరాజు సంచారం



**రాంచీ:** జార్ఖండ్ రాజధాని రాంచీలో శుక్రవారం ఉదయాన్నే ఓ గజరాజు అలజడి రేపింది. ఉదయం 5 గంటలప్పుడు నగర శివార్లలో కనిపించిన ఆ ఏనుగు 5 గంటలపాటు నివాస ప్రాంతాల్లో సంచరిస్తూ ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. బిర్సా చౌక్, రాంచీ విమానాశ్రయం ప్రాంతాల్లో సంచరిస్తున్న ఏనుగును అటవీ సిబ్బంది ఉదయం 10 గంటల సమయానికి విజయవంతంగా అడవిబాట పట్టించగలిగారు. మధ్యాహ్నం 2.30 గంటలకు అక్కడికి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న అడవిలోకి ప్రవేశించింది. 'దారి తప్పిన ఆ ఏనుగు నగరంలోకి ప్రవేశించింది. ఉదయం వేళ చిన్నారులు స్కూళ్లకు వెళ్లే సమయం కావడంతో అన్ని ముందు జాగ్రత్తలు తీసుకున్నాం'అని రాంచీ డివిజన్ అటవీ అధికారి శ్రీకాంత్ వర్మ చెప్పారు. ఎటువంటి నష్టం జరగలేదన్నారు. హల్బా అటవీ ప్రాంతం నుంచి ధుర్వా వైపు తరచూ ఏనుగులు వస్తున్నాయని వివరించారు.



# కార్నీ పర్యటన ప్రారంభం

**సోమవారం మోదీతో భేటీ**

**న్యూఢిల్లీ:** భారత్ ప్రపంచంలోనే శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అని కెనడా ప్రధాని మార్క్ కార్నీ అన్నారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం ఆయన శుక్రవారం భారత్ చేరుకున్నారు. ఉన్నతాధికారుల బృందంతో కలిసి శుక్రవారం సాయంత్రం ముంబై విమానాశ్రయంలో దిగారు. అనంతరం పలువురు వ్యాపారవేత్తలతో భేటీ అయ్యారు. ఆదివారం కార్నీ ఢిల్లీ చేరుకుంటారు. సోమవారం ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమై పలు అంశాలపై చర్చలు జరపనున్నారు. అనంతరం విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో కూడా భేటీ అవుతారు. 2023లో కెనడాలో ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్యానంతరం ఇరుదేశాల సంబంధాలు బాగా దెబ్బ తిన్న విషయం తెలిసిందే. వాటిని తిరిగి బలోపేతం చేసుకోవడంతో పాటు పలు రంగాల్లో నూతన ఒప్పందాలు కుదుర్చుకోవడమే లక్ష్యంగా కార్నీ భారత్‌లో పర్యటిస్తున్నారు. భారత్, కెనడా వ్యూహాత్మక భాగస్వామ్యంలో భాగంగా వాణిజ్యం, ఇంధనం, టెక్నాలజీ సహా పలు రంగాలపై ప్రధానులు లోతుగా చర్చలు జరుపుతారని విదేశాంగ శాఖ పేర్కొంది.



# తెలుగు పరిశ్రమపై తాప్సీ ప్రశంసలు

హీరోయిన్ తాప్సీ పన్ను ప్రధానపాత్రలో నటించిన అస్సీ మూవీ తాజాగా విడుదలైంది. కోర్టు రూమ్ డ్రామాగా వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తోంది. తెలుగులో తన కెరీర్‌ను ప్రారంభించిన ఈ బ్యూటీ కొంత కాలంగా టాలీవుడ్ పరిశ్రమ పట్ల చేస్తున్న విమర్శలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ క్రమంలో ఆమెపై విమర్శలు కూడా వచ్చాయి. సౌత్‌ఇండస్ట్రీలో హీరోయిన్లు మరింత ఆకర్షణీయంగా కనిపించాలనే ఉద్దేశంతో ప్యాడెడ్ బ్రా ధరించాలని ఇక్కడి ఫిల్మ్‌మేకర్స్ తనపై ఒత్తిడి తెచ్చేవారని ఆరోపించింది. అయితే, ఆమె ఇప్పుడు యూటర్న్ తీసుకొని తెలుగు పరిశ్రమపై ప్రశంసలు కురిపించింది.

తెలుగు, తమిళ సినిమాలతో కెరీర్ మొదలుపెట్టిన తాప్సీ.. 'చష్మే బద్దూర్' మూవీతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత పింక్, థప్పడ్ వంటి సినిమాలతో తనకంటూ స్టార్ ఇమేజ్‌ని అక్కడ క్రియేట్ చేసుకుంది. తాజాగా బాలీవుడ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలుగు పరిశ్రమపై మక్కువను చాటుకుంది. తెలుగు సినిమాలో నటనకు ఎక్కువ ప్రాధాన్యం ఉండే పాత్రలు ఉంటాయని ఆమె గుర్తు చేసుకుంది.

అయితే, తెలుగులో మాదిరి తమిళ పరిశ్రమలో అలాంటివి తక్కువగా కనిపిస్తాయని ఆమె పేర్కొంది. టాలీవుడ్ నుంచి తనకు మంచి పాత్రలే దక్కడంతో తెలుగు వారు తనను బాగా అభిమానిస్తారని చెప్పింది. తన విలువను పెంచిన సినిమాలన్నీ కూడా తెలుగు నుంచే ఉన్నాయని తెలిపింది. తన కెరీర్‌కు టాలీవుడ్ పరిశ్రమ ఎంతగానో ఉపయోగపడిందని తాప్సీ గుర్తు చేసుకుంది. ఝుమ్మంది నాదం మూవీతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ 2022లో చివరిగా 'మిషన్ ఇంపాజిబుల్'లో మెరిసింది.



# చేసింది 12 సినిమాలే.. కోట్ల పారితోషికం... అవకాశాలు రావట్లేదు!

ఈ తరం హీరోయిన్లు నటనపై కంటే ధనార్జన పైనే ఎక్కువ దృష్టి పెడుతున్నారా? అలా అవకాశాలను కోల్పోతున్నారా ? నటి రుక్మిణి వసంత్ లాంటి నటీమణులను చూస్తుంటే అలానే అనిపిస్తోంది. ఈ కన్నడ భామ సినీ పయనం జస్ట్ ఆరేళ్లే. అయితే ఈ అమ్మడు ఇంత తక్కువ కాలంలోనే పాన్ ఇండియా కథానాయకిగా మారడం విశేషమే. 2019లో ఒక కన్నడ చిత్రం ద్వారా నటిగా ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ ఆ వెంటనే బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ తరువాత తమిళం, తాజాగా తెలుగు భాషల్లో చిత్రాలు చేశారు. ఇటీవల కన్నడం చిత్రం కాంతార –2లో నటించి విశేష గుర్తింపును పొందారు. పారితోషికం పెంచాలంటే ఎవరైనా, మంచి విజయం కోసం ఎదురు చూడాలి. అలాంటి హిట్ రుక్మిణి వసంత్‌కు కాంతారా– 2 చిత్రంతో వచ్చింది. తాజాగా ఓ తెలుగు, కన్నడ చిత్రంలో నటిస్తున్నారు. తమిళంలో ఇంతకు ముందు విజయ్ సేతుపతికి జంటగా ఏస్ చిత్రంలో ఎంట్రీ ఇచ్చారు. ఆ చిత్రం పూర్తిగా నిరాశ పరిచింది. ఆ తరువాత శివకార్తికేయన్ సరసన నటించిన మదరాసి చిత్రం ఓకే అనిపించుకుంది.

అదే విధంగా తెలుగులోనూ రంగప్రవేశం చేశారు. అక్కడ నటించిన తొలి చిత్రం అప్పుడో ఇప్పుడో ఎప్పుడో చిత్రం విజయాన్ని ఇవ్వలేదు. అయినప్పటికీ ఈ అమ్మడికి లక్కు ఉన్నట్లుంది ఇప్పుడు డ్రాగన్ చిత్రంలో జూనియర్ ఎన్టీఆర్ సరసన నటించే అవకాశం వరించింది. ఇకపోతే కన్నడంలో యశ్‌తో కలిసి నటించిన టాక్సిక్ చిత్రం త్వరలో తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. కాగా ఈ అమ్మడి చేతిలో డ్రాగన్ అనే ఒక్క చిత్రం మాత్రమే ఉంది. కొత్తగా అవకాశాలు రావడం లేదు. దీనికి కారణం ఈ భామ తన పారితోషికాన్ని అమాంతంగా పెంచేయడమేనట. ఇలాంటి ప్రచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతుండటం వల్లే దర్శక నిర్మాతలు ఈ బ్యూటీని ఎంపిక చేయడానికి వెనుకడుగు వేస్తున్నారట. రుక్మిణి వసంత్ ఇప్పటికి అన్ని భాషల్లో కలిపి 12 చిత్రాలు మాత్రమే చేశారు. అప్పుడే కోట్లలో పారితోషికం డిమాండ్ చేస్తుండడం చర్చనీయాశంగా మారుతోంది.

## పెళ్లి తర్వాత మోదీ, అమిత్ షాలను కలిసిన 'విరోష్' జోడీ



విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న కలిసి ఏడడుగుల బంధంతో ఒక్కటయ్యారు. ప్రస్తుతం ఇంటర్నెట్‌లో ఎక్కడ చూసినా సరే 'విరోష్' జోడీ పేరుతో వారి ఫోటోలు వైరల్ అవుతున్నాయి. నిన్న ఉదయపూర్‌లో అంగరంగ వైభవంగా వీరి వివాహం జరిగిన విషయం తెలసిందే. అయితే, మార్చి 4న జరగనున్న తమ రిసెప్షన్‌కు రావాలని ప్రధాని నరేంద్ర మోదీతో పాటు కేంద్రమంత్రి అమిత్ షాను విజయ్, రష్మిక ఆహ్వానించారు. పెళ్లి కార్యక్రమం పూర్తి అయిన తర్వాత నూతన దంపతులు కలిసి అహ్వానం అందించారు. ఇప్పటికే వారిద్దరికీ శుభాంకాక్షలు చెబుతూ మోదీ ఒక లేఖ విడుదల చేసిన విషయం తెలిసిందే. మార్చి 4న హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో రిసెప్షన్ జరగనుంది. ఈ రిసెప్షన్ కోసం ఇప్పటికే పలువురు



రాజకీయ సినీ వ్యాపారవేత్తలను విజయ్, రష్మిక ఆహ్వానించారు. 'గీత గోవిందం' సినిమాలో హీరో హీరోయిన్లుగా పెళ్లి పీటల మీద కూర్చున్న విజయ్ దేవరకొండ - రష్మికా మందన్నా నిజ జీవితంలో ఏడడుగులు వేశారు. ముందు స్నేహితులై, ఆ తర్వాత ప్రేమికులుగా మారి ఇప్పుడు భార్యాభర్తలయ్యారు. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో వీరి వివాహం రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో గల మెమెంటోస్ ప్యాలెస్‌లో ఉదయం 10 గంటల 10 నిమిషాలకు వైభవంగా, ఆహ్లాదకరంగా జరిగింది. ఉదయం తెలుగు, సాయంత్రం కొడవ (కర్ణాటకకు చెందిన కొడగు జిల్లా రష్మిక సొంతూరు) సంప్రదాయం పరంగా పెళ్లి వేడుకలు జరిగాయి. దండలు మార్చుకున్నప్పుడు వధూవరులిద్దరూ ఆనందబాష్పాలతో ఉద్వేగానికి గురయ్యారు. భావోద్వేగాలు, చిరునవ్వులు మధ్య జరిగిన ఈ వివాహ వేడుకల్లో పాల్గొన్నవారు నూతన వధూవరులిద్దర్నీ ఆశీర్వదించారు.

# కథ బోల్డ్ అయినా పర్లేదు

## రొమాంటిక్ సీన్స్ చిరాకు పుట్టించేలా..


**కెరీర్ ఎంత స్పీడులో ఉన్నా సరే పెళ్లవగానే సినిమాలు తగ్గించేస్తుంటారు హీరోయిన్స్. కానీ కథానాయిక భాగ్యశ్రీ మాత్రం పెళ్లయ్యాకే వెండితెరపై ఎంట్రీ ఇచ్చింది. సల్మాన్ ఖాన్ మైనే ప్యార్ కియా చిత్రంతో కథానాయికగా పరిచయమైంది. తక్కువకాలంలోనే స్టార్ హీరోయిన్ స్టేటస్ అందుకుంది. ప్రస్తుతం సహాయక పాత్రలు పోషిస్తోంది.**

**కాలక్షేపం కోసం..**

తాజాగా ఓ ఇంటర్వ్యూలో సినిమాల పరిస్థితిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. భాగ్యశ్రీ మాట్లాడుతూ... సమాజాన్ని ప్రతిబింబించేవే సినిమాలు. 90'sలో జనాలకు వినోదం అంటే సినిమానే గుర్తొచ్చేది. కుటుంబంతో కలిసి సమయం కేటాయించడానికి, కాలక్షేపం చేయడానికి సినిమాకు వెళ్లేవారు. ఇప్పుడన్నీ మారిపోయాయి. చిన్న కుటుంబాలే ఎక్కువయ్యాయి. వినోదం కోసం అనేక మాధ్యమాలు వచ్చాయి. జనాలకు ఆప్షన్స్ ఎక్కువయ్యాయి.

**బలవంతంగా ఇరికించొద్దు**

అదే సమయంలో అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించడం అసాధ్యంగా మారింది. సినిమాల్లోనూ జానర్స్ వచ్చాయి. వాస్తవికతకు పెద్ద పీట వేశారు. అయితే మోడ్రన్ సినిమాల్లో సహజత్వం కోసం రొమాంటిక్ సన్నివేశాలను బలవంతంగా చొప్పించాల్సిన అవసరం లేదు. తల్లిదండ్రులు లేదా పిల్లలతో కూర్చుని సినిమా చూస్తున్నప్పుడు అలాంటి క్లోజప్ సీన్స్ చిరాకు తెప్పిస్తాయి అని చెప్పుకొచ్చింది.



సినిమా

ఒకప్పుడు హీరోయిన్‌గా సినిమాలు చేసిన భాగ్యశ్రీ.. ప్రభాస్ 'రాధేశ్యామ్'లోనూ కీలక పాత్రలో కనిపించింది. ఆ తర్వాత మూడు, నాలుగు హిందీ సినిమాల్లో నటించి వెండితెరపై చిన్న బ్రేక్ తీసుకుంది. దాదాపు మూడేళ్ల తర్వాత రాజా శివాజీ అనే చిత్రం చేస్తోంది. ఈ మూవీ మే 1న విడుదల కానుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com